శుక్రవారం
FRIDAY
2-10-2026

జగిత్యాల JAGITIAL || పేజీలు:12 PAGES:12 || వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 2 Volume:2 || సంచిక: 95 Issue: 95

Circulated to Telangana
Published from Jagitial

నేటి ఈవార్తలు

PRGI REGD NO: TGTEL/25/A1385

Circulated to Telangana
Published from Jagitial

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com



ఈవార్తలు
వచ్చేశాం
ఈవార్తలు యాప్‌తో..
GET IT ON Google Play




## ఫైనల్‌లో భారత హాకీ జట్టు

టోక్యో: ఆసియా క్రీడలు 2026లో భారత హాకీ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. మహిళల విభాగంలో నిన్న దక్షిణ కొరియాపై గెలిచి భారత్ ఫైనల్‌కు చేరుకోగా.. తాజాగా భారత పురుషుల జట్టు కూడా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విజయం సాధించి తుదిపోరుకు సిద్ధమైంది. ఉత్కంఠంగా సాగిన సెమీస్‌లో భారత్ 4-3 తేడాతో పాక్‌ను చిత్తు చేసి.. బంగారు పతకం గెలవాలని పట్టుదలతో ఉంది.



## ఫైనల్‌లో టీమిండియా క్రికెట్ టీం

టోక్యో: పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన రెండో సెమీఫైనల్‌లో భారత్ అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించడంతో శ్రీలంకపై 124 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌లోకి ప్రవేశించింది. కొరోగి స్పోర్ట్స్ పార్క్ నిస్సిన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టు టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన లంక బ్యాటర్లు 9.5 ఓవర్లలో కేవలం 45 పరుగులకే ఆలౌట్ అయ్యారు. ఫలితంగా భారత్ 124 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది.

# 235 మండలాల్లో కరువు

### 17 శాతం తక్కువ వర్షపాతం.. భారీగా విద్యుత్తు వినియోగం

### ఉద్యోగులకు రెండు డీఏలు.. టీజీ కేబినెట్ కీలక నిర్ణయాలు



రాష్ట్రంలో ఎల్‌నినో కోరలు చాస్తోందని కేబినెట్ అభిప్రాయపడింది. దీంతో 235 మండలాల్లో తీవ్ర కరువు సంభవించిందని, 17 శాతం లోటు వర్షపాతం నమోదైందని వెల్లడించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది.

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను విడుదల చేసేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఉద్యోగ, పెన్షనర్ వర్గాలకు ఊరట లభించనుంది. డీఏల అమలుతో రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.2,500 కోట్ల అదనపు భారం పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డీఏలకు సంబంధించిన బకాయిలను విడతల వారీగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండు విడతలను విడుదల చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఈ నిర్ణయం వర్తించనుంది. ఇప్పటికే ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో రెండు డీఏల విడుదలపై హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా కేబినెట్ ఆమోదంతో ఈ నిర్ణయానికి అధికారికంగా ముందడుగు పడింది. డీఏ బకాయిలన్నింటినీ ఒకేసారి తరువాయి 2 వ పేజీలో...



## ఉప సర్పంచ్ పవర్‌కు 'చెక్'!

### ఈవో, ఎంపీడీవోకు చెక్ పవర్

### రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): గ్రామ పంచాయతీల్లో చెక్ పవర్ విషయంలో జరుగుతున్న ఘర్షణ కు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల విషయంలో ఎదురవుతున్న జాప్యానికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య విభేదాల కారణంగా చెక్కులపై సంతకాలు ఆలస్యం కావడం.. ఇలా జరగడం వల్ల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో పడుతున్న పరిస్థితిని నివారించేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. పంచాయతీల్లో -2 వ పేజీలో...



# ఎల్‌నినో కోరలు

### అక్టోబర్ నుంచే ఉగ్ర రూపం.. నైరుతి రుతుపవనాలు వెనక్కి

### చాలా ప్రాంతాల్లో లోటు వర్షపాతం.. వేసవిని తలపించేలా ఎండలు

### వాతావరణ నిపుణుల ఆందోళన

అక్టోబర్ రాకతో నైరుతి రుతుపవనాలు ముగిశాయి.. ఇక వాతావరణంలో మరో కీలక మార్పు మొదలుకానుంది. ఎల్‌నినో మరింత బలపడుతున్న వేళ.. అక్టోబర్ నుంచే దాని ప్రభావం కనిపించే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ తాజా అంచనాలు చెబుతున్నాయి. ఈశాన్య సీజన్‌లో దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే ఉండొచ్చని తెలుస్తోంది.

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): చాలా ప్రాంతాల్లో పగటి పూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందట. ఈ మేరకు వాతావరణ ఔట్‌లుక్‌ను తాజాగా విడుదల చేసిన ఐఎండీ.. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు అక్టోబర్ నుంచి పుంజుకుని, నవంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశముందని పేర్కొంది. రాబోయే రోజుల్లో.. దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని చెబుతోంది. అయితే వాయవ్య భారతంలోని కొన్ని ప్రాంతాలు, అలాగే దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,924 |
| వెండి (కిలో): | రూ.2,40,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,279 |

## విశ్వవాణి



సాధారణంగా ప్రతి కనురెప్పపై ఒక వరుస వెంట్రుకలు ఉంటాయి. అయితే అరుదుగా కనిపించే డిస్టికియాసిస్ అనే పరిస్థితిలో అదనంగా మరో వరుస వెంట్రుకలు పెరుగుతాయి. కొందరిలో ఇది జన్యుపరమైన కారణాలతో పుట్టుకతోనే ఉండగా, మరికొందరిలో కంటి వ్యాధులు లేదా గాయాల కారణంగా తర్వాత ఏర్పడుతుంది. ఈ అదనపు వెంట్రుకలు సాధారణ వెంట్రుకల కుదుళ్ల నుంచి కాకుండా, కంటిని తేమగా ఉంచేందుకు నూనెను ఉత్పత్తి చేసే మెబోమియన్ గ్రంథుల ద్వారాల నుంచి పెరగవచ్చు. అవి కంటికి చాలా దగ్గరగా ఉండటంతో లోపలికి వాలి కార్నియాను పదేపదే రుద్దే అవకాశం ఉంటుంది. దీంతో కంటి ఎర్రబారడం, నొప్పి, అధికంగా నీరు కారడం, కంటిలో ఏదో ఉన్నట్లుగా అనిపించడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. తీవ్రంగా ఉన్నప్పుడు కార్నియా దెబ్బతిని, కంటి ఇన్ఫెక్షన్ ముప్పు కూడా పెరగవచ్చు.

# రీచార్జ్‌తో ఉచిత బీమా

### కస్టమర్లకు బీఎస్ఎన్ఎల్ ఆఫర్.. అక్టోబర్ 1 నుంచే అమల్లోకి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కస్టమర్లకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పింది. రెండు ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్లపై ఉచిత ఇన్సూరెన్స్ ప్రయోజనాలను ప్రకటించింది. ఈ ఆఫర్ ద్వారా వినియోగదారులకు రూ.1 లక్ష వరకు యాక్సిడెంటల్ కవరేజి, అలాగే రూ. 10,000 వరకు సైబర్ ఫ్రాడ్ రక్షణ లభిస్తాయి. ఎస్‌టీవీ 202, ఎస్‌టీవీ 2449 ప్రీపెయిడ్ ప్లాన్లపై ఈ ఫ్రీ బీమా, సైబర్ ఫ్రాడ్ కవరేజీని కల్పించనుంది. అంటే వినియోగదారులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.1 లక్ష వరకూ బీమా, బీఎస్ఎన్ఎల్ నంబర్‌పై సైబర్ మోసాలకు గురైతే రూ.10 వేలు కవరేజీ లభిస్తుంది. అక్టోబర్ 1 నుంచే ఇవి అమల్లోకి వస్తున్నట్లు సంస్థ





ప్రకటించింది. ఈ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని అందించేందుకు బీఎస్ఎన్ఎల్ సంస్థ ది ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. వినియోగదారులు దీని కోసం ప్రత్యేకంగా ఎలాంటి తరువాయి 2 వ పేజీలో...

# వాణిజ్య గ్యాస్ సిలిండర్ రూ.62.50 పెంపు

### పండుగ వేళ షాక్ ఇచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ: పండగల సీజన్ ప్రారంభమైన వేళ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు దేశ ప్రజలకు షాకిచ్చాయి. 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఒక్కో సిలిండర్ పై ఏకంగా రూ.62.50 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ పెంపు అక్టోబర్ 1వ తేదీ నంచే అమలులోకి వచ్చింది. హైదరాబాద్‌లో రూ.2996 నుంచి రూ.3058.50 వద్దకు చేరింది. కాగా, 14.2 కిలోలు ఉండే డొమెస్టిక్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు పాత పద్ధతిలోనే కొనసాగుతున్నాయి. ఢిల్లీలో ఒక సిలిండర్ ధర -2 వ పేజీలో...







## ఫాం-6 కు డిక్లరేషన్ ఇవ్వాల్సిందే: సీఈవో

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మందికి నోటీసులు ఇస్తే ఇప్పటి వరకు 65 లక్షల మంది ఓటర్లు నోటీసులకు సమాధానం ఇచ్చినట్లు సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. 54 లక్షల మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు. నవబంర్ 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ ఉంటుందని తరువాయి 2 వ పేజీలో...

# 34% బీసీ రిజర్వేషన్లు రద్దు

### మొత్తం 50 శాతానికి మించరాదు

### 6 వారాల్లోగా ఎన్నికలు పూర్తి చేయాలి

### ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు తీర్పు





అమరావతి, అక్టోబర్ 1 (ఈవార్తలు): ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీం కోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం తరువాయి 2 వ పేజీలో...



## స్పెషల్ టెట్-2 నోటిఫికేషన్ రిలీజ్

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): ఇన్-సర్వీస్ టీచర్లకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఉపాధ్యాయుల కోసం నిర్వహించనున్న ప్రత్యేక టెట్-2కు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబర్ 7 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరించనున్నారు. నవంబర్ 16 నుంచి 21 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు స్కూల్ తరువాయి 2 వ పేజీలో...

# ప్రజాసేవకు పదండి!

### ఉద్యోగంతోనే ఆగిపోవద్దు

### యువతకు ప్రధాని మోదీ సందేశం

### యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాలకు హాజరు

### భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ



న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
2.10.2026

మేషం: ఉద్యోగాలలో అధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులలో ఆలోచించి ముందుకు సాగడం మంచిది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి.

వృషభం: వృత్తి వ్యాపారాలు ఆశించిన విధంగా సాగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సోదరులతో వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. దూరపు బంధువుల కలయిక సంతోషాన్నిస్తుంది. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మిధునం: వృత్తి వ్యాపారాలలో ఆశించిన లాభాలు పొందుతారు. సంతానం విద్యా ఉద్యోగ విషయాల్లో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు కలసివస్తాయి.

కర్కాటకం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. బంధు మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఉద్యోగ యత్నాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపారాలలో స్వల్ప నష్టాలు తప్పవు. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

సింహం: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవాంతరాలు కలుగుతాయి. సహోద్యోగులతో చిన్నపాటి మాటపట్టింపులు ఉంటాయి. ఇంటా బయట గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు.

తుల: సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ముఖ్యమైన పనులలో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగాలలో గందరగోళ వాతావరణం ఉంటుంది. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా ఉంటాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మంచి మాటతీరుతో ఇంటా బయట అందరిని ఆకట్టుకుంటారు. వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు.

ధనస్సు: వ్యాపార, ఉద్యోగాలలో స్వల్ప వివాదాలు తప్పవు. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటుంది. నూతన ఋణాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

మకరం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. సంతాన ఉద్యోగ యత్నాలు సానుకూలమౌతాయి. కొత్త వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో మెరుగ్గా రాణిస్తారు.

కుంభం: సంతాన వివాహ విషయమై చర్చలు ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. జీవిత భాగస్వామితో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మీనం: వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. బంధు మిత్రులతో అకారణ వివాదాలు ఉంటాయి. చేపట్టిన పనులు వాయిదా పడుతాయి. ఉద్యోగాలలో అదనపు పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. ప్రయాణాలు వీలైనంతవరకు వాయిదా వేయడం మంచిది. సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది.

# 235 మండలాల్లో కరువు

మొదటి పేజీ తరువాయి

కాకుండా విడతల వారీగా చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు.. ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, పీఆర్సీ వంటి అంశాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. కేబినెట్ సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఈ ఏడాది తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే సుమారు 17 శాతం తక్కువ వర్షపాతంతో ముగిసినట్లు ప్రభుత్వం తెలిపింది. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావం, కరవు తరహా పరిస్థితులు నెలకొన్నట్లు కేబినెట్‌లో చర్చ జరిగింది. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో ఏర్పడిన వర్షపాతం లోటుపై కేబినెట్ సబ్‌కమిటీ చర్చించి తక్షణ ఉపశమన చర్యలపై నివేదిక సిద్ధం చేయనుంది. రైతు సంఘాలు, వాతావరణ నిపుణులతోనూ సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు. అలాగే కరువు పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రానికి అవసరమైన సహాయాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంతో పాటు.. తెలంగాణ పరిస్థితిని వివరించేందుకు త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లనుంది. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ సీజన్‌లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు, సిబ్బంది, మౌలిక వసతులను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌నినో పరిస్థితులు, ఉష్ణోగ్రతల ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినట్లు కేబినెట్‌లో చర్చించారు. తెలంగాణలో సాధారణంగా రోజువారీ విద్యుత్ వినియోగం సుమారు 15 వేల మెగావాట్ల వరకు ఉండగా.. ఈ సీజన్‌లో పీక్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరింది. గత ఏడాది గరిష్ఠ డిమాండ్ 16,613 మెగావాట్లుగా ఉంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కేబినెట్ నిర్ణయించింది. అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 7,800 మెగావాట్ల కొత్త విద్యుత్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, 800 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పోటీ బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించారు. భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్నారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత పండ్ల మార్కెట్ నిర్మించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సుమారు 240 ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునఃసమీక్షించాలని కేబినెట్ నిర్ణయించింది. గతంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా అసంపూర్తిగా ఉన్న 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, వ్యయం, ప్రయోజనాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని దీర్ఘకాలంగా పెండింగ్‌లో




ఉన్న పనులపై ప్రభుత్వం సమీక్ష కొనసాగించనుంది. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టును మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాలను సమన్వయం చేసేందుకు నలుగురు గ్రూప్–1 అధికారులను నియమించేందుకు ఆమోదం తెలిపింది. తెలంగాణలో డిజిటల్ మీడియా సంస్థలకు సంబంధించి ప్రత్యేక ప్రకటన విధానాన్ని తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విధానానికి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీ రూపొందించనున్నారు. ఈ విధానం ద్వారా డిజిటల్ మీడియాకు ప్రభుత్వ ప్రకటనల జారీకి ప్రత్యేక మార్గదర్శకాలు ఏర్పడే అవకాశం ఉంది.

### తెలంగాణ కేబినెట్ నిర్ణయాల్లో ముఖ్యాంశాలు:

- 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలకు ఆమోదం
- డీఏ బకాయిలను విడతల వారీగా చెల్లింపు
- రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.2,500 కోట్ల అదనపు భారం
- 17 శాతం వర్షపాతం లోటుపై కేబినెట్ చర్చ
- సుమారు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- కరువు పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం
- రైతు సంఘాలు, నిపుణులతో సంప్రదింపులు
- కేంద్ర సాయం కోరేందుకు నిర్ణయం
- ఢిల్లీకి మంత్రుల బృందం వెళ్లే అవకాశం
- 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
- విద్యుత్ పీక్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరడంపై చర్చ
- 7,800 మెగావాట్ల కొత్త విద్యుత్ సామర్థ్యానికి ప్రణాళిక
- 3,000 మెగావాట్ల సోలార్, 4,000 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజ్, 800 మెగావాట్ల పవర్ ప్రాజెక్టులు
- కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులకు వేగం
- 10 అసంపూర్తి ఈపీసీ సాగునీటి ప్రాజెక్టుల నిలిపివేతకు ఆమోదం
- తెలంగాణ భవన్‌లో డిప్యూటీ కమిషనర్ పోస్టు
- ఢిల్లీలో నలుగురు గ్రూప్–1 అధికారుల నియామకం
- ప్రత్యేక డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీకి ఆమోదం

# ప్రజాసేవకు పదండి!

మొదటి పేజీ తరువాయి

గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో కోరలు

మొదటి పేజీ తరువాయి

నుంచి అతి వర్షాలు కురిసే అవకాశం ఉందట. అక్టోబర్–డిసెంబర్ పోస్ట్ మాన్సూన్ సీజన్‌లోనూ దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే ఉండొచ్చని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. వర్షాలతోపాటు ఉష్ణోగ్రతలపైనా ఐఎండీ కీలక అంచనాలు వెల్లడించింది. అక్టోబర్‌లో దేశంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా ఉండొచ్చని పేర్కొంది. దీంతో వర్షాలు తగ్గే పరిస్థితులతోపాటు పగటి వేడి కొనసాగొచ్చని అంచనా. ప్రస్తుతం దేశంలో ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతుండగా.. రాబోయే రోజుల్లో మరింత బలపడనున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) ప్రకారం.. రాబోయే నెలల్లో ఎల్‌నినో 'హై' స్థాయికి చేరే అవకాశముంది. నవంబర్–డిసెంబర్ నాటికి గరిష్ఠ తీవ్రతకు చేరే అవకాశముందని డబ్ల్యూఎంఓ పేర్కొంది. ఈ ప్రభావం 2027 ప్రారంభం వరకూ కొనసాగే అవకాశం ఉంది. భారత ప్రభుత్వానికి జూలైలో ఇచ్చిన సమాధానంలోనూ ఐఎండీ.. అక్టోబర్–డిసెంబర్ 2026లో ఎల్‌నినో మరింత బలపడి 'వెరీ స్ట్రాంగ్' కేటగిరీకి చేరొచ్చని తెలిపింది. భూమధ్యరేఖకు సమీపంలోని పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే వేడెక్కే వాతావరణ పరిస్థితినే ఎల్‌నినో అంటారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలుల ప్రసరణపై ప్రభావం చూపగలదు. భారత్‌లో ఎల్‌నినో పరిస్థితులు సాధారణంగా రుతుపవన వర్షాలను బలహీనపరిచే అవకాశంతో సంబంధం కలిగి ఉంటాయి. అయితే భారత వర్షపాతాన్ని ఎల్‌నినో ఒక్కటే నిర్ణయించదు. ఐఓడీ, ఎంఎన్‌జే వంటి ఇతర సముద్ర–వాతావరణ పరిస్థితులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

### 13 శాతం లోటుతో నైరుతి

ఇప్పటికే 2026 నైరుతి రుతుపవనాలు 12.6 శాతం లోటుతో ముగిశాయి. జూన్–సెప్టెంబర్ మధ్య దేశవ్యాప్తంగా 759.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లతో పోలిస్తే ఇది 109.2 మిల్లీమీటర్ల లోటు. ఈ లోటుతో 2026 నైరుతి సీజన్ 2001 తర్వాత నాలుగో అత్యల్ప వర్షపాతం నమోదైన సీజన్‌గా నిలిచింది. ఈసారి దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు కనిపించాయి. అయితే వర్షపాతాన్ని ప్రభావితం చేసిన అంశాల్లో ఎల్‌నినోతోపాటు అల్పపీడనాలు, మాడెన్–జూలియన్ ఆసిలేషన్ (ఎంఎన్‌జే) వంటి ఇతర వాతావరణ వ్యవస్థలూ ఉన్నాయి. అందువల్ల సీజన్‌లో నమోదైన లోటును ఎల్‌నినో ఒక్కదానికే ఆపాదించలేమని ఐఎండీ వివరించింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ.. దక్షిణ ద్వీపకల్ప భారతానికి కొంత ఊరట ఉంది. అక్టోబర్–డిసెంబర్ కాలంలో ఈ ప్రాంతంలో మొత్తంగా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. అయితే ప్రాంతాలవారీగా పరిస్థితుల్లో తేడాలు మాత్రం ఉండొచ్చని పేర్కొంది.

# ఫాం-6 కు డిక్లరేషన్ ఇవ్వాల్సిందే: సీఈవో

మొదటి పేజీ తరువాయి

ఆలోపు మిగతా ఓటర్లను కూడా తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు హియరింగ్ అనే ప్రక్రియ ఉండేదని ఇకపై దాని స్థానంలో డాక్యుమెంట్ కలెక్ట్ చేసుకోవడమే ఉంటుందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామని, నోటీసులు అందుకున్న వారిలో 40 శాతం మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు. నోటీసులు అందినవారి ఇళ్ల దగ్గరకే బీఎల్□వోలు వెళ్లి సంబంధిత పత్రాలు తీసుకుంటారన్నారు. ఒక చోట కూర్చుని ఓటర్లను పిలిపించుకోవడం కుదరదని ఓట్లర్ల ఇళ్ల వద్దకే వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు బీఎల్□వోలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చ□మన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన పని లేదని ఒక్కరే మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందన్నారు. ఫారమ్–6 కు డిక్లరేషన్ అనేది ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారని, తెలంగాణలో ఎస్ఐఆర్ ఇంకా కొనసాగుతున్నందునా ఫారమ్–6 కు డిక్లరేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. నోటీసులు అందిన వారిలో ఎవరైనా వలస వెళ్లి ఉంటే అలాంటి వారిని పిలవాల్సిన అవసరం లేదని ఈఆర్వో ఆన్□లైన్□లోనే వారిని సంప్రదించి ప్రక్రియను పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలనేది ఈసీ ఉద్దేశం అన్నారు. మరోవైపు, సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదన్నారు. ఇప్పటికే ఓసారి గడువు పెంపుకోరామని అందువల్ల ఇది కుదరదన్నారు. ప్రస్తుతం ఉన్న గడవు ప్రకారం క్లెయిమ్□లు, అభ్యంతరాల దాఖలుకు గడువు అక్టోబర్ 7 వరకు ఉండగా నోటీసులు జారీ/అభ్యంతరాల పరిష్కారానికి నవంబర్ 5 వరకు, తుది ఓటరు జాబితా 9 నవంబర్□న ప్రచురించనున్నారు.

# 34% బీసీ రిజర్వేషన్లు రద్దు

సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది. మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

# స్పెషల్ టెట్-2 నోటిఫికేషన్ రిలీజ్

మొదటి పేజీ తరువాయి

ఎడ్యుకేషన్ డైరెక్టర్, టీజీ టెట్ చైర్ పర్సన్ డాక్టర్ నవీన్ నికోలస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### ముఖ్యమైన తేదీలు:

నోటిఫికేషన్ విడుదల తేదీ: 1అక్టోబర్ 2026
ఇన్ఫర్మేషన్ బులెటిన్ లభ్యం: 07 అక్టోబర్ 2026 నుండి
దరఖాస్తులు, ఫీజు చెల్లింపు ప్రారంభం: 07 అక్టోబర్ 2026
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 16 అక్టోబర్ 2026
పరీక్ష నిర్వహణ తేదీలు: 16 నవంబర్ నుంచి 21 నవంబర్ వరకు

# ఉప సర్పంచ్ పవర్‌కు 'చెక్'!

మొదటి పేజీ తరువాయి

చెక్కుల చెల్లింపులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు (డీపీఓ) ప్రభుత్వం స్పష్టమైన సూచనలు చేసింది. కొత్త ఆదేశాల ప్రకారం.. గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపులకు సంబంధించిన చెక్కులపై ఉప సర్పంచ్ సంతకం చేయాల్సి ఉంటే.. కారణం లేకుండా వాటిని పెండింగ్‌లో పెట్టకూడదని తెలిపింది. తగిన కారణం లేకుండా ఏడు రోజులకు మించి సంతకం చేయకుండా జాప్యం చేస్తే సంబంధిత జిల్లా కలెక్టర్ దానిపై విచారణ చేపట్టాల్సి ఉంటుంది. విచారణలో ఉప సర్పంచ్ ఉద్దేశపూర్వకంగానే చెక్కులపై సంతకం చేయకుండా బిల్లుల చెల్లింపులను అడ్డుకున్నట్లు తేలితే.. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేవలం వ్యక్తిగత విభేదాలు, ఇతర కారణాలతో పంచాయతీ నిధుల చెల్లింపులు నిలిచిపోకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉప సర్పంచ్‌కు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను తొలగించి.. ఆయన స్థానంలో అధికారుల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ కల్పించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

# రీచార్జ్‌తో ఉచిత బీమా

మొదటి పేజీ తరువాయి

ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. అక్టోబర్ 1న బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఇన్సూరెన్స్ ప్లాన్లను ప్రారంభించారు. చందాదారులు ఈ ప్లాన్లతో రీఛార్జ్ చేసుకున్న 24 గంటల తర్వాత ఇన్సూరెన్స్ పాలసీ ఆటోమేటిక్‌గా యాక్టివేట్ అవుతుంది.

# వాణిజ్య గ్యాస్ సిలిండర్ రూ.62.50 పెంపు

మొదటి పేజీ తరువాయి

రూ.942 వద్ద ఉండగా ముంబైలో రూ.914.150, చెన్నైలో రూ.957.50 వద్ద స్థిరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ నగరంలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.994 వద్ద స్థిరంగా ఉంది. మరోవైపు డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై సుంకాలను కేంద్ర ప్రభుత్వం మరోసారి తగ్గించింది. లీటర్ డీజిల్ పై రూ.16 చొప్పున ఎక్స్‌పోర్ట్ డ్యూటీని తగ్గించినట్లు తెలిపింది. ఏటీఎఫ్ పై లీటరుకు రూ.10.5 మేర తగ్గించారు. పెట్రోల్ ఎగుమతులపై సుంకంలో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు.



# స్వచ్ఛత నిరంతర బాధ్యత

**ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ భారత్ ఉద్యమం**

**పీఐబీ ఏడీజీ శ్రుతి పాటిల్ వెల్లడి**

హైదరాబాద్, అక్టోబర్ 1 (పీఐబీ): స్వచ్ఛ భారత్ మిషన్ ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్న ఉద్యమమని పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ అన్నారు. పరిశుభ్రతను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. 'స్వచ్ఛతా మే సహభాగ్-స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్' ఇతివృత్తంతో నిర్వహిస్తున్న 'స్వచ్ఛతా హీ సేవా--2026'లో భాగంగా గురువారం కవాడిగూడలోని సీజీఓ టవర్స్‌లో 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్' శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఐబీ, సీబీసీ హైదరాబాద్ అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొని సీజీఓ టవర్స్ పరిసరాలను శుభ్రం చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రుతి పాటిల్ మాట్లాడుతూ.. పరిశుభ్రతను రోజువారీ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని అధికారులు, సిబ్బందికి పిలుపునిచ్చారు. సీజీఓ టవర్స్ పరిసరాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందించారు. వారి సేవలకు గుర్తింపుగా గ్లౌవ్స్, పారిశుద్ధ్య కిట్లను అందజేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా సీజీఓ టవర్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పీఐబీ, సీబీసీ హైదరాబాద్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్రవల్లి భూ సర్వే నివేదిక రెడీ

సిద్దిపేట, అక్టోబర్ 1 (ఈవార్తలు): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి భూముల సర్వే నివేదిక సిద్ధమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు చేపట్టిన సర్వేకు సంబంధించిన పూర్తి నివేదికను అధికారులు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి అందజేశారు. ఈ నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పించనున్నారు. నివేదికలో ఏ అంశాలను పొందుపరిచారు? భూములపై ఎలాంటి వివరాలు వెల్లడవుతాయి? అన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాలు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో అధికారులు సర్వే నిర్వహించారు. ఎర్రవల్లిలో 244 మంది అనుభవదారులకు, వెలికట్టలో 118 మందికి నోటీసులు ఇచ్చారు. అనంతరం ఆయా భూముల్లో క్షేత్రస్థాయిలో హద్దులు, కబ్జాపై ఉన్నవారి వివరాలను పరిశీలించారు. ఎర్రవల్లిలో ఎనిమిది రోజుల పాటు, వెలికట్టలో ఐదు రోజుల పాటు సర్వే కొనసాగింది. ఈ భూముల విషయంలో శివారు వెంకటాపూర్ గ్రామస్థులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని వారు చెబుతున్నారు. ఇటీవల వెంకటాపూర్ రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. పాత రికార్డుల ఆధారంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు సర్వే నంబర్ 325లో భూములు సాగు చేసుకుంటున్న రైతుల్లోనూ ఆందోళన ఉంది. దశాబ్దాలుగా తమ అధీనంలో ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వారు ఎదురుచూస్తున్నారు. సర్వే సందర్భంగా రైతులు తమ వద్ద ఉన్న పట్టా పాస్‌బుక్కులు, ఇతర పత్రాలను అధికారులకు చూపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మర్కూక్ మండల పరిధిలోని భూములపై లెక్కలు తేల్చాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ సర్వే చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పుడు కలెక్టర్ సమర్పించనున్న నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలకంగా మారింది.



## జగన్ దూకుడు

**కేడర్‌తో కీలక సమావేశాలు**

తాడేపల్లి, అక్టోబర్ 1 (ఈవార్తలు): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘంగా కసరత్తు చేపట్టారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఆయన రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రణాళికాబద్ధంగా ఎన్నికలను ఎదుర్కొనేందుకు వీలుగా ప్రతి నియోజకవర్గం, జిల్లా వారీగా పార్టీ పరిస్థితిపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఈ భేటీ ఉదయం 11 గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు ఏకధాటిగా కొనసాగింది. సుమారు తొమ్మిది గంటల పాటు సాగిన ఈ సుదీర్ఘ సమీక్షలో జగన్ ప్రతి జిల్లా నాయకుడితో వ్యక్తిగతంగా మాట్లాడారు. స్థానిక పరిస్థితులు, కేడర్‌లోని ఉత్సాహం, ఎదురవుతున్న సవాళ్లతో పాటు పార్టీ అనుబంధ రంగాలు, కమిటీల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న బలాబలాలు, నాయకుల మధ్య సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాల వారీగా జరిగిన ఈ సమీక్షల్లో రాబోయే స్థానిక సమరంలో అనుసరించాల్సిన వ్యూహాలపై జగన్ నేతలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రజల్లో నిరంతరం ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ, స్థానిక పోరులో విజయం సాధించడమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్‌లు ప్రారంభం




హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు) : నగరవాసులకు మెట్రో రైలు,ఆర్టీసీ బస్సు ప్రయాణాలను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రయాణికులు రెండు వేర్వేరు టికెట్లు లేదా పాస్‌ల కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా, ఒకే కామన్ పాస్‌తో రెండు రకాల రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. మహాత్మా గాంధీ జయంతి (అక్టోబర్2న) సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రజా భవన్ వేదికగా రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఈ కామన్ పాస్ ప్రారంభమవుతుంది. నగరంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సేవలను మరింత అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గతంలోనే అధికారులను ఆదేశించారు. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సు సర్వీసులను జోడించి సంయుక్త ప్రయాణ పాస్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్, టీజీఎస్‌ఆర్టీసీ సంయుక్తంగా ఈ ప్రత్యేక రవాణా సదుపాయాన్ని అమల్లోకి తెస్తున్నాయి. ప్రజా రవాణాను మరింత ప్రోత్సహించడానికి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడానికి ఈ కామన్ పాస్ ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం రోజువారీ, నెలవారీ పాస్‌లను అందుబాటులోకి తెస్తున్నారు. రోజువారి జాయింట్ పాస్ రూ.400 నిర్ణయించగా.. నెలవారీ జాయింట్ పాస్‌ను రూ.8,500గా ఖరారు చేసినట్లు తెలుస్తోంది ఇకపై ప్రయాణికులు వేర్వేరుగా టికెట్లు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. మెట్రో స్టేషన్ల నుండి ఆర్టీసీ బస్సులు, సిటీ బస్సులకు మారేటప్పుడు ఈ కామన్ పాస్ సౌకర్యవంతంగా ఉంటుంది. సమయం ఆదా కావడంతో పాటు రవాణా ఖర్చులు కూడా మరింత సులభతరం అవుతాయి. అక్టోబర్ 2న జరిగే లాంచ్ కార్యక్రమంలో ఈ పాస్‌ల కొనుగోలు విధానం, దరఖాస్తు ప్రక్రియ, పూర్తిస్థాయి మార్గదర్శకాలను అధికారులు అధికారికంగా వెల్లడించనున్నారు.

## నా హోటళ్లకు రేవంత్ ఫ్రీ పబ్లిసిటీ

**ఆస్తులపై విచారణకు సిద్ధమా?**
**సీఎంకు కేటీఆర్ సవాల్**



హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): సిరిసిల్ల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్, ఆయన కుటుంబం ఆస్తులపై చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ముఖ్యంగా తన కుటుంబ ఆస్తులు, వ్యాపారాలపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. రెండు కుటుంబాల ఆస్తులపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు సిద్ధమా అంటూ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తుల్లో ఏదైనా తప్పు ఉన్నట్లు విచారణలో తేలితే చట్ట ప్రకారం ఎలాంటి శిక్షకైనా తాము సిద్ధమని కేటీఆర్ చెప్పారు. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపై కూడా అదే తరహాలో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇరు కుటుంబాల ఆస్తులను పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి విచారణకు సీఎం అంగీకరిస్తే తాము పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. ఇదే డిమాండ్‌ను కేటీఆర్ గతంలోనూ బహిరంగంగా ప్రస్తావించారు. సిరిసిల్లలో తన హోటళ్ల గురించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రస్తావనపై కేటీఆర్ స్పందిస్తూ.. "నా హోటళ్లకు రేవంత్‌రెడ్డి ఉచితంగా ప్రచారం ఇచ్చారు. అందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు" అంటూ ఎద్దేవా చేశారు. తాను అమెరికాలో 6 ఏళ్ల పాటు ఉద్యోగం చేశానని.. అక్కడ సంపాదించిన డబ్బుతో ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించినట్లు కేటీఆర్ చెప్పారు. అప్పట్లో ఒక హోటల్ ఉండగా.. ప్రస్తుతం 3 హోటళ్లుగా విస్తరించాయని పేర్కొన్నారు. తన వ్యాపార వివరాలను 2009 ఎన్నికల అఫిడవిట్లలోనే వెల్లడించానని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి రాకపోయి ఉంటే ఆ హోటళ్లను 10 చేసే వాడిని అని వ్యాఖ్యానించారు. వ్యాపారం చేయడంలో తప్పేముందని కేటీఆర్ ప్రశ్నించారు. తమ కుటుంబ ఆస్తులు, రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అని కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. విచారణలో తమ కుటుంబం తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా భారీగా పోలీసులను మోహరించడంపైనా కేటీఆర్ విమర్శలు చేశారు. ప్రతిపక్ష నేతలపై రాజకీయ విమర్శలు చేయడానికి ఇంత భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఎందుకని ప్రశ్నించారు. సిరిసిల్ల పర్యటనలో చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలపై సీఎం మాట్లాడాల్సి ఉండగా.. ప్రధానంగా రాజకీయ ఆరోపణలకే పరిమితమయ్యారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేనేత కార్మికుల పరిస్థితిపై తాము ప్రశ్నలు లేవనెత్తుతున్నామని.. ముఖ్యంగా ఆత్మహత్యలు చేసుకున్న కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతున్నామని చెప్పారు. ఈ అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తమ కుటుంబ ఆస్తుల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

## కల్కి భగవాన్ కన్నుమూత

**ఎల్ఐసీ క్లర్క్ టు ఆధ్యాత్మిక వేత్తగా కల్కి భగవాన్**

**కల్కి భగవాన్ ట్రస్ట్ సామాజిక సేవా కార్యక్రమాలు**

తిరుపతి, అక్టోబర్ 1 (ఈవార్తలు): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కల్కి భగవాన్ కన్నుమూశారు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురికాగా.. కల్కి భగవాన్‌ను పదిరోజులు క్రితం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు తుదిశ్వాస విడిచారు. కల్కి భగవాన్ అంత్యక్రియలను శనివారం తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తులవల్లంలోని ఏకం ఆలయమైన గోల్డెన్ సిటీలో నిర్వహిస్తారు. అక్కడే సమాధి చేయనున్నారు. గురుదేవుల మృతితో భక్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆధ్యాత్మిక బోధనలు, సేవలను స్మరించుకుంటూ భక్తులు గురుదేవులకు నివాళులర్పిస్తున్నారు. కల్కి భగవాన్ అసలు పేరు విజయ్‌కుమార్ నాయుడు.. 1949లో తమిళనాడులో జన్మించారు.. అక్కడే చదువుకున్నారు. ఆయన ఎల్ఐసీలో క్లర్క్‌గా పని చేశారు.. 1977 జూన్ 9న పద్మావతితో వివాహం జరిగింది. అనంతరం ఆయన ఆధ్యాత్మికత, విద్యవైపుగా వెళ్లారు.. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం రాజుపేట దగ్గర జీవాశ్రమం పేరుతో రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించారు. విజయ్‌కుమార్ 1990 ప్రాంతంలో తనను కల్కి అవతారమని ప్రకటించారు.. ఆయన భార్య పద్మావతి అమ్మ భగవాన్ పేరుతో అందరికి పరిచయం అయ్యారు. అనుచరులకు పరిచయమయ్యారు. అనంతరం రూ.200 కోట్లతో తెల్లటి పాలరాతి నిర్మాణంతో ఆలయం 2005లో ప్రారంభమైంది. తమిళనాడులోని తిరువళ్లూరు దగ్గర నేమం ప్రాంతంలో కల్కి భగవాన్‌గా ఆధ్యాత్మిక బోధనలు ప్రారంభించారు. ఆ తర్వాత తిరుపతి జిల్లా వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలో కల్కి గ్రామీణాభివృద్ధి ట్రస్టు ప్రారంభించి.. అక్కడ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

### ఎన్నో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు

కల్కి భగవాన్ సతీమణి అమ్మభగవాన్‌తో కలిసి ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వీరికి ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారు.. కల్కి భగవాన్ ఆశ్రమాల్లో విదేశీ భక్తులతో పాటు, దేశ నలుమూలల నుంచి వచ్చే వారు ఉంటారు. వీరికి ధ్యానం, ముక్తి దీక్ష తదితర ఆధ్యాత్మిక తరగతులు నిర్వహించేవారు. కల్కి పేరుతో గ్రామీణాభివృద్ధి, వన్నెస్ హ్యూమన్, లోకా ఫౌండేషన్, ముక్తి వంటి పలు ట్రస్టులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఏకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కల్కి భగవాన్ ట్రస్ట్‌ల ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది గ్రామాల్లో తాగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే పేద ప్రజల కోసం ఆసుపత్రులు, ఉచిత వైద్య శిబిరాలు, కంటి ఆపరేషన్ల శిబిరాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత విద్య, పుస్తకాల పంపిణీ, పాఠశాల మౌలిక వసతులు వంటివి




## రేవంత్, మహేశ గౌడ్ కలిసి ఉంటారా?: జీవన్ రెడ్డి

జగిత్యాల,అక్టోబర్ 1 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వచ్చే ఎన్నికల వరకు రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ జోడీ ఉంటుందా? అని సూటిగా ప్రశ్నించారు. వీరి జోడీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వీళ్లు గొప్పగా చెప్పుకుంటున్నారని... వీళ్లు ఎన్ని రోజులు కలిసుంటారో వీళ్లకే తెలియదని ఎద్దేవా చేశారు. ఈయన పీసీసీ ప్రెసిడెంట్ గా ఉంటాడో లేదో ఆయనకు తెలియదని... ఆయన సీఎంగా ఉంటాడో లేదో ఈయనకు తెలియదని అన్నారు. మీ జోడీ, మీ పేర్లు చూసి జనాలు ఓట్లు వేసినట్టయితే... 2023 ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో 7 నియోజకవర్గాలుంటే ఒక్కటైనా గెలిచావా రేవంత్ రెడ్డీ? అని ప్రశ్నించారు..

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



## వైసీపీ నుంచి జనసేనలోకి 1000 మంది

పెద్దాపురం, అక్టోబర్ 1 (ఈవార్తలు): ఏపీలోని సామర్లకోట, పెద్దాపురం నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని భారీ షాక్ తగిలింది. నియోజకవర్గ స్థాయి వైసీపీ ముఖ్య నాయకులతో పాటు సుమారు 1,000 మందికి పైగా కార్యకర్తలు ఆ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరారు. వీరితో పాటు వైసీపీ వైస్ చైర్మన్ సాయిప్రసాద్, ఆయన ప్రధాన అనుచరులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ భారీ చేరికల ద్వారా ప్రాంతీయ రాజకీయాల్లో తీవ్ర సంచలనం వ్యక్తమవుతోంది. ఈ చేరికల కార్యక్రమం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిగింది. కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో వీరి చేరికలు ముగిశాయి. జనసేన నేతలు స్వయంగా పార్టీ కండువాలు కప్పి నూతనంగా వచ్చిన నాయకులను, కార్యకర్తలను పార్టీలోకి ఎంతో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఇతర నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి సముచిత స్థానం, తగిన గౌరవం అందిస్తామని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తల భద్రతకు, సంక్షేమానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ప్రశ్న రావణ్ దర్యాప్తు గడువు మరో 30 రోజులు



విజయవాడ, అక్టోబర్ 1 (ఈవార్తలు): ఉపా కింద నమోదైన కేసులో నిందితుడైన ప్రశ్న రావణ్‌కు సంబంధించిన దర్యాప్తు గడువును కోర్టు మరొక 30 రోజులు పొడిగించింది. ఈ మేరకు కృష్ణా జిల్లా కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రావణ్‌పై నమోదైన కేసులో చట్ట ప్రకారం నిర్ణయించిన 90 రోజుల దర్యాప్తు కాలపరిమితి రేపటితో ముగియనుంది. దీంతో కేసు విచారణ, దర్యాప్తు ప్రక్రియను పూర్తి చేసేందుకు మరింత సమయం అవసరమని దర్యాప్తు అధికారులు భావించారు. ఈ క్రమంలో కృష్ణా జిల్లా కోర్టును ఆశ్రయించారు. విచారణను మరింత లోతుగా నిర్వహించాల్సి ఉన్నందున గడువును పొడిగించాలని కోరుతూ కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం దర్యాప్తు గడువును మరో 30 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

# విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్తు: ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, అక్టోబర్ 1 (ఈవార్తలు): దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతిలోనే ఉందని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు, గౌరవాన్ని కాపాడే బాధ్యత వారిదేనని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాలలో రూ.5.5 కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. బ్యాంకింగ్ ఫైనాన్స్, బీఎస్సీ హెల్త్‌కేర్ వంటి కొత్త కోర్సులతో విద్యార్థినులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. చాట్‌జీపీటీ వంటి నూతన సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు ఉపాధ్యాయుల బోధనలు, సూచనలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రూ.1 కోటి నిధులతో ఉర్దూ ఘర్ భవన నిర్మాణ పనులు త్వరలో




# జగిత్యాల జిల్లాలో నెల పాటు పోలీస్ యాక్ట్

జగిత్యాల, అక్టోబర్ 1 (ఈవార్తలు): శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పోలీస్ యాక్ట్-1861 ప్రకారం అక్టోబర్ 1 (ఈవార్తలు) నుంచి 31 వరకు నెల రోజులపాటు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు.







# పెట్రోల్ బంక్ స్థల కేటాయింపుపై విచారణ జరపాలి: జీవన్ రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 1 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 105లో ఉన్న పురాతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కూల్చి ప్రభుత్వ స్థలాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కేటాయించడంపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టర్‌కు లేఖ రాశారు. 1905లో నిర్మించిన సుమారు 120 ఏళ్ల నాటి భవనాన్ని పురాతన కట్టడాల పరిరక్షణ విభాగం అనుమతి లేకుండా కూల్చివేశారని ఆయన ఆరోపించారు. జీఓఎంఎస్ నంబర్ 571ను ఆధారంగా చేసుకుని టెండర్ ప్రక్రియ లేకుండా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 621 చదరపు గజాల స్థలాన్ని ఐఓసీఎల్‌కు లీజుకు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలానికి ఉన్న మార్కెట్ విలువతో పోలిస్తే నామమాత్రపు అద్దె నిర్ణయించారని, నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. కేటాయింపును రద్దు చేసి సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరారు.




# స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడ అర్బన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): వేములవాడ మండల పరిధిలోని పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ జెడ్పీహెచ్ఎస్(జీ)లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ప్రత్యేక అతిథి ఉపాధ్యాయుడి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు బి. బన్నాజీ తెలిపారు. ప్రత్యేక బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. నెలకు రూ.16,500 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9948335036 నంబర్‌లో ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని కోరారు.



# గామా.. ఘరానా మోసం

**సాయం పేరుతో డబ్బులు వసూలు**

**బాధితుల ఆరోపణలు**

వేములవాడ అర్బన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): సేవా కార్యక్రమాలు, ఆర్థిక సహాయం పేరుతో తమ నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారని గామా ఫౌండేషన్‌కు చెందిన కొందరు బాధితులు ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, గంభీరావుపేట మండలాలకు చెందిన పలువురు మహిళలు గురువారం మీడియా ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం ప్రకారం.. ఫౌండేషన్‌లో కొత్త సభ్యులను చేర్పిస్తే ప్రతి సభ్యుడికి ఏడాది పాటు ఎనిమిది విడతల్లో నెలకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం లేదా రూ.750 విలువైన నిత్యావసర సరుకుల కిట్లు ఇస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారని తెలిపారు. ఇందుకోసం ఒక్కో సభ్యుడి నుంచి రూ.2,750 చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. ప్రారంభంలో రెండు, మూడు నెలలపాటు కొంతమందికి నగదు, సరుకుల కిట్లు అందించి నమ్మకం కల్పించిన అనంతరం గత నాలుగు నెలలుగా ఎలాంటి సహాయం అందించడం లేదని వాపోయారు. వేములవాడ ప్రాంతంలోని చింతల్‌ఠాణా, రుద్రవరం గ్రామాలకు చెందిన బాధితుల ప్రకారం.. సుమారు 11 మంది ప్రతినిధుల ద్వారా 500 మందికి పైగా సభ్యులను చేర్పించి రూ.4.50 లక్షలకు పైగా వసూలు చేశారని ఆరోపించారు. గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామానికి చెందిన 11 మంది కూడా ఇదే తరహాలో తమ నుంచి డబ్బులు వసూలు చేశారని తెలిపారు. తమకు రావాల్సిన నగదు, సరుకులు లేదా చెల్లించిన సొమ్ము గురించి ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపించారు. అప్పులు చేసి డబ్బులు చెల్లించామని, ప్రస్తుతం వాటికి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడంతో పాటు తమ నుంచి వసూలు చేసిన సొమ్మును తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం, పోలీసులను బాధితులు కోరారు.

# మూడు నెలలకోసారి రక్తదానం చేయాలి

జగిత్యాల, అక్టోబర్ 1 (ఈవార్తలు): ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం, జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శివగాయత్రి వృద్ధాశ్రమంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో



వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, కంటి, చెవి-ముక్కు-గొంతు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సివిల్ ఆసుపత్రి రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి రక్తదానం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అత్యవసర సమయాల్లో రక్తం కొరత లేకుండా ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.



# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తాటిపల్లి విద్యార్థినులు

మల్యాల, అక్టోబర్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో తాటిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జి. యశస్విని, పి. మేఘన, రాఘశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మానస, పీఈటీ బి. మధులిక తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 5 వరకు వేములవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ మానస ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

# మెట్‌పల్లిలో కోర్టు భవన స్థల పరిశీలన

మెట్‌పల్లి, అక్టోబర్ 1 (ఈవార్తలు): మెట్‌పల్లి పట్టణంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల గురువారం పరిశీలించారు. భవిష్యత్తులో కోర్టు భవనం విస్తరణకు అవకాశం ఉండేలా ప్రస్తుత కోర్టు ప్రాంగణానికి ఆనుకుని ఉన్న స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు. కోర్టు భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ప్రస్తుతం మంజూరైన ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాన్ని ప్రత్యామ్నాయ అనువైన స్థలంలో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కోర్టు భవన నిర్మాణ పనులు త్వరితగతిన ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సురేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, ఇరిగేషన్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.





# రాజకీయ విమర్శలకే సీఎం సభ: బీఆర్ఎస్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1 (ఈవార్తలు): సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. సీఎం పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు అన్నారు. పోలీసు నిర్బంధాల మధ్య సభ నిర్వహించాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి వచ్చిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని వారు పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. సమావేశంలో జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, తోట అగయ్య, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, తుల ఉమ, చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ సభ రాజకీయ బలప్రదర్శన కోసమే

**బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ విమర్శ**

వేములవాడ అర్బన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ బలప్రదర్శన కోసమే నిర్వహించారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ విమర్శించారు. వేములవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లాకు వస్తే ప్రజా సమస్యలపై ప్రకటనలు వస్తాయని ప్రజలు ఆశించారని, అయితే సభలో రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం లభించిందని ఆయన ఆరోపించారు. సీఎం పర్యటన కారణంగా సాధారణ ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో, రాతి నిర్మాణాలు ఎప్పుడు చేపడతారో స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆలయాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆయన ఆరోపించారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, కటుకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంజన్న స్వామిని దర్శించుకున్న కలెక్టర్

మల్యాల, అక్టోబర్ 1 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి ఆలయ మర్యాదలతో కలెక్టర్‌కు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శేషవస్త్రంతో కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఈవో అంజనా రెడ్డి, సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ప్రధాన అర్చకులు చిరంజీవ స్వామి, ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



# 3 రోజుల సోలార్ అవగాహన కార్యక్రమం

**సోలార్ సేవా సేతు అభియాన్ ప్రారంభం**

జగిత్యాల, అక్టోబర్ 1 (ఈవార్తలు): ఎన్‌పీడీసీఎల్, రెడ్కో సంయుక్తంగా చేపట్టిన 'సోలార్ సేవా సేతు అభియాన్' మూడు రోజుల అవగాహన కార్యక్రమాన్ని జగిత్యాల ఎస్ఈ సుదర్శనం గురువారం ప్రారంభించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా పైకప్పులపై సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోందని తెలిపారు. అక్టోబర్ 1 (ఈవార్తలు) నుంచి 3 వరకు జరిగే కార్యక్రమంలో సౌర విద్యుత్ వినియోగంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవడం, మిగులు విద్యుత్‌ను సంస్థకు విక్రయించి



ఆదాయం పొందడం, ప్రభుత్వ రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈ గంగారాం, ఏడీఈ నాయక్, ఏఈలు, రెడ్కో సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

# 2,000 రోజులుగా అన్నదాన సేవలు

**భీమేశ్వర ఆలయం వద్ద 200 మందికి అన్నదానం**

వేములవాడ అర్బన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): దాతల సహకారంతో భీమేశ్వర ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 2,000 రోజులు పూర్తి చేసుకుంది. ఇందులో భాగంగా గురువారం 200 మంది నిరుపేదలు, అన్నార్తులు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. 2,000 రోజులు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కారునాథం శివ-స్వాతి దంపతులు, వారి కుమారుడు విఖ్యాత్, నేరెళ్ల తులసీరామ్ తదితరులు అన్నదానానికి సహకరించారు. శాశ్వత అన్నదాన సభ్యులుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత, ప్రతాప-స్వప్న-సంపత్, నగుబోతు రవీందర్-జ్యోతి, గణాచారి మఠం శైలజ-సాంబశివు, దేవరాజు ఉమ-బాలచందర్‌రాజు తదితరులు ఉన్నారని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, శాశ్వత అన్నదాన సభ్యులు, పాత్రికేయులు, ట్రస్టు సభ్యులను



నిర్వాహకులు మధు మహేష్ సన్మానించారు. పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం తదితర సందర్భాల్లో నిరుపేదలకు అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్టును సంప్రదించాలని కోరారు. వివరాలకు 9246939388ను సంప్రదించవచ్చన్నారు.

# కల్కి ఆశ్రమంపై ఆరోపణలు.. ఐటీ దాడులు



గతంలో కల్కి ఆశ్రమంపై ఆరోపణలు కూడా వచ్చాయి.. పలు వివాదాల్లో చిక్కుకున్నారు. ఆయన ఆస్తులు, ఆశ్రమాలపై ఐటీ దాడులు జరిగాయి. 2008లో కల్కి భగవాన్ ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆ సమయంలో జరిగిన తొక్కిసలాటలో పలువురు భక్తులు చనిపోగా.. కొందరు గాయపడ్డారు. 2019 అక్టోబర్‌లో ఐటీ దాడులు కలకలం రేపాయి. ఈ సోదాల్లో డబ్బులతో పాటుగా విదేశీ కరెన్సీ, కిలోల కొద్ది బంగారం బయపటడింది. అంతేకాదు లెక్కల్లో లేని ఆదాయం, విదేశాల్లో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ ఐటీ దాడుల తర్వాత కల్కి భగవాన్ వీడియో ద్వారా సందేశాన్ని పంపారు. సామాన్య ఉద్యోగిగా ప్రస్థానం మొదలుపెట్టి కల్కి భగవాన్‌గా ఎంతోమంది భక్తుల్ని సంపాదించుకున్న ఆయన ప్రస్థానం ముగిసింది.

# దేవుళ్ల మధ్య రేవంత్ చిచ్చు

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**



న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

## ఎవరీ కెప్టెన్ స్మిత్ మచ్చార్?

గుజరాత్‌కు చెందిన స్మిత్ మచ్చార్ కమర్షియల్ ఏవియేషన్ రంగంలో పదేళ్లకు పైగా విశేష అనుభవం కలిగిన పైలట్. జూన్ 2011 నుండి 2022 వరకు దాదాపు 11 ఏళ్లపాటు భారత విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2022లో డైరెక్ట్ ఎంట్రీ కెప్టెన్‌గా ఫ్లైదుబాయ్‌లో చేరారు. బోయింగ్ 737 విమానాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల్లో ఆయన నిపుణుడు. వెలింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పొందారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, ఆయన కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది.

# శరీరంలో కత్తి దిగినా..

## 174 మందిని కాపాడాడు.. భారత పైలట్ సాహసం.. రియల్ హీరో : మోదీ.. ప్రపంచ నేతల ప్రశంసలు



దుబాయ్: దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఊహించని ప్రమాదం తప్పింది. గాల్లో ఉండగానే కో-పైలట్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన భారత సంతతి కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. రక్తమోడుతున్నప్పటికీ కాక్‌పిట్ తలుపు తెరిచి, పెను విమాన ప్రమాదాన్ని నివారించి 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. బోయింగ్ 737 మ్యాక్స్-8 విమానం గాల్లో ఉండగా, ఒమన్ జాతీయుడిగా భావిస్తున్న కో పైలట్ అకస్మాత్తుగా కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై కత్తితో దాడి చేశాడు. విమాన నియంత్రణ వ్యవస్థలను ధ్వంసం చేసి, విమానాన్ని కూల్చేందుకు అతను తీవ్రంగా ప్రయత్నించాడు. ఆ పెనుగులాటలో విమానం కేవలం 30 సెకన్లలోనే దాదాపు 14,000 అడుగుల కిందికి దూసుకువచ్చింది. తీవ్ర గాయాలపాలై కిందపడిపోతున్న సమయంలో కూడా కెప్టెన్ స్మిత్ చాకచక్యంగా కాక్‌పిట్ డోర్‌ను అన్‌లాక్ చేసి కేకలు వేశారు. విమానం తీవ్ర కుదుపులకు లోనవడం, అరుపులు వినిపించడంతో అప్రమత్తమైన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. కాక్‌పిట్‌లోకి చొరబడిన ప్రయాణికులలో యానివ్ అనే ఇజ్రాయెల్ ప్లంబర్ ప్రధాన పాత్ర పోషించారు. టీవీలో ప్రసారమయ్యే ఎయిర్ డిజాస్టర్స్ కార్యక్రమాలు చూసి విమానాల నియంత్రణపై ప్రాథమిక అవగాహన పెంచుకున్నట్లు చెప్పిన యానివ్, ఇతర ప్రయాణికులతో కలిసి విధ్వంసానికి పాల్పడుతున్న కో-పైలట్‌ను కుర్చీ నుంచి వెనక్కి లాగి బంధించారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు పైలట్లు, భద్రతా సిబ్బంది వెంటనే కాక్‌పిట్ నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుని విమానాన్ని అదుపు చేశారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. దాదాపు 8 గంటల నిరీక్షణ అనంతరం ప్రయాణికులను మరో ప్రత్యామ్నాయ విమానంలో టెల్ అవీవ్‌కు తరలించారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. గురువారం ఉదయం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్న ప్రధాని.. కెప్టెన్ స్మిత్ మచార్‌ను హీరోగా అభివర్ణించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తీవ్రంగా గాయపడినా, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, అచంచలమైన సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, పెద్ద విషాదాన్ని నివారించిందని అన్నారు. కెప్టెన్ మచార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. కెప్టెన్ స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన అద్భుత ధైర్యాన్ని ప్రపంచ నేతలు కొనియాడారు. ఓవల్ ఆఫీస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. "స్మిత్ చాలా తీవ్రమైన గాయాలపాలైనా సమయస్ఫూర్తితో వ్యవహరించి రియల్ హీరోగా నిలిచారు. ఇదొక అద్భుతమైన సంఘటన" అని అన్నారు. తీవ్రంగా గాయపడినా వెనకడుగు వేయకుండా ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యానికి నా సెల్యూట్. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. స్మిత్‌ను అత్యంత నైపుణ్యం కలిగిన వీరుడిగా అభివర్ణిస్తూ, భారత్-ఇజ్రాయెల్-యూఏఈ తరఫున ఆయన క్షేమం కోసం ప్రార్థిస్తున్నట్లు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి తెలిపారు.

## వరుసగా నాలుగో రోజూ నష్టాలే

### 22,450 దిగువకు చేరిన నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజు నష్టాల్లో ముగిసింది. ఇంధన ధరలు పెరగడం, బాండ్ ఈల్డ్స్‌లో హెచ్చుతగ్గులు, వడ్డీ రేట్లు మరింత పెరిగే అవకాశాలపై ఆందోళనలతో గురువారం సూచీలు భారీగా పడిపోయాయి. సెన్సెక్స్ 570.59 పాయింట్లు కోల్పోయి 71,909.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 198.50 పాయింట్లు నష్టపోయి 22,421.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి 22,400 స్థాయి కీలక మద్దతుగా మారిందని నిపుణులు తెలిపారు. ఇది కూడా నిలవకపోతే నిఫ్టీ 22,200-22,000 వరకు పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. 22,600-22,800 స్థాయి తక్షణ నిరోధంగా మారిందని చెప్పారు. ఇంధన ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. అంతర్జాతీయ బాండ్ మార్కెట్లలో మార్పులు కూడా మదుపరులను అప్రమత్తం చేశాయి. దీంతో పలు రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. నిఫ్టీలో బజాజ్ ఆటో, మారుతి సుజుకి ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఆటో, ఆర్థిక రంగ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.01 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.97 శాతం చొప్పున పడిపోయాయి. ఆటోమొబైల్, మీడియా, మెటల్, ఎఫ్‌ఎంసీజీ రంగాలు ఎక్కువగా నష్టపోయాయి. ఐటీ షేర్లు మాత్రం మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచాయి.

## విద్యార్థులకు ఫ్రీగా జోహో క్లౌడ్ సేవలు

### శ్రీధర్ వెంబు కీలక ప్రకటన



బెంగళూరు: ప్రముఖ టెక్ దిగ్గజ 'జోహో' విద్యార్థుల కోసం ఒక అద్భుతమైన అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. తమ సొంత క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాట్‌ఫామ్ 'క్యాటలిస్ట్' సేవలను విద్యార్థులకు పూర్తి ఉచితంగా అందిస్తున్నట్లు కంపెనీ సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ప్రకటించారు. విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులను రూపొందించుకోవడానికి, వాటిని క్లౌడ్ వేదికపై హోస్ట్ చేయడానికి ఈ ప్లాట్‌ఫామ్ ఎంతగానో దోహదపడుతుంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), గూగుల్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ అజూర్ వంటి అంతర్జాతీయ క్లౌడ్ దిగ్గజాలపై ఆధారపడకుండా, జోహో తన సొంత అవసరాల నిమిత్తం పూర్తిస్థాయి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించుకుంది. డేటాబేస్‌లు, కంప్యూటింగ్, స్టోరేజ్, మెసేజింగ్ సిస్టమ్స్ వంటి కీలక సేవలను సంస్థ స్వయంగా అభివృద్ధి చేసింది. ప్రస్తుతం 'క్యాటలిస్ట్' పేరిట ఈ సర్వర్‌లెస్ క్లౌడ్ సేవలను బాహ్య డెవలపర్లతో పాటు విద్యార్థులకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిణామాలపై శ్రీధర్ వెంబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సాంకేతిక రంగం ఏఐ విషయంలో అత్యంత వేగంగా పురోగమిస్తోందని, ఇది "డ్రైవింగ్ సరిగా తెలియని ఒక హై-స్పీడ్ కారును నడపడం వంటిది" అని ఆయన అభివర్ణించారు. డెవలపర్లు తాము రూపొందించే వ్యవస్థలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలంటే, క్షేత్రస్థాయిలో లోతైన పరిజ్ఞానం కలిగి ఉండటం అత్యంత ఆవశ్యకమని ఆయన సూచించారు.

## కరెంట్ బిల్లుతో చలాన్ల లింక్ లేదు

### సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో కీలక స్పష్టత

న్యూఢిల్లీ: ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన ఈ-చలాన్ల బకాయిలను విద్యుత్ బిల్లులతో అనుసంధానం చేయాలనే వార్తలపై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. విచారణ సందర్భంగా ఈ అంశాన్ని కేవలం నోటి మాటగా ప్రస్తావించామే తప్ప, గురువారం వెల్లడించిన తుది ఉత్తర్వుల్లో అలాంటి ఆదేశాలేవీ లేవని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, దేశవ్యాప్తంగా పేరుకుపోయిన చలాన్ల బకాయిల వసూలుకు అత్యంత కఠినమైన చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ జె.బి. పార్థీవాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. ఇకపై చలాన్లు పెండింగ్‌లో ఉంటే వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) రెన్యువల్ లేదా డూప్లికేట్ పత్రాల జారీని నిలిపివేయాలి. వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) ధ్రువీకరణ పత్రాలను కూడా జారీ చేయకూడదు. బకాయిలున్న వాహనాలను పరివహన్ పోర్టల్‌లో బ్లాక్‌లిస్ట్ చేయాలని, దీనివల్ల సదరు వాహనాల విక్రయం లేదా యాజమాన్య బదిలీ సాధ్యం కాదని కోర్టు పేర్కొంది. బకాయిలు చెల్లించని వాహనాలను తనిఖీల్లో గుర్తించి, అవసరమైతే వాటిని సీజ్ చేయాలని కూడా కోర్టు ఆదేశించింది. నిబంధనలను పదేపదే ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్సులను రెన్యువల్ చేయవద్దని, ఇప్పటికే ఉన్న లైసెన్సులను సస్పెండ్ చేయాలని సూచించింది. కేవలం ఈ-చలాన్లు జారీ చేస్తే సరిపోదని, వాటి ద్వారా విధించిన జరిమానాలను సమర్థంగా వసూలు చేయడంపై దృష్టి సారించాలని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సుమారు రూ.49,194.05 కోట్ల విలువైన ఈ-చలాన్లు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు రూ.26,175.05 కోట్లు మాత్రమే వసూలయ్యాయని కోర్టు దృష్టికి వచ్చింది. మోటారు వాహన చట్టం, 1988 నిబంధనల అమలుపై దాదాపు 14 ఏళ్లుగా ఈ కేసు విచారణ జరుగుతోందని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 25వ తేదీకి వాయిదా వేసింది.

## హెచ్‌డీఎఫ్‌సీ ఎండీగా అనుప్ బగ్చీ

### మూడేళ్ల పాటు పదవిలో కొనసాగింపు

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీకి నూతన సారథి రానున్నారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈ వో)గా అనుప్ బగ్చీని నియమిస్తున్నట్లు బ్యాంక్ బోర్డు ప్రకటించింది. ప్రస్తుత ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అనుప్ బగ్చీ నియామకంతో పాటు ఆయన వేతన ప్యాకేజీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అక్టోబర్ 1న ఆమోదం తెలిపింది. ఆయన 2026 అక్టోబర్ 27 నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. బగ్చీ పదవీకాలం 2029 అక్టోబర్ 26న ముగుస్తుంది. ప్రస్తుత సీఈవో శశిధర్ జగదీశన్ పదవీకాలం 2026 అక్టోబర్ 26తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం ఖరారైంది. ఐఐటీ కాన్పూర్, ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన అనుప్ బగ్చీకి బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. గతంలో ఆయన ఐసీఐసీఐ గ్రూప్‌లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవోగానూ ఆయన సేవలందించారు. బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవం కలిగిన బగ్చీ నాయకత్వంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరింత పురోగతి సాధిస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.






లవ్లీ చిత్రం







## విజయ్-రష్మిక లగ్జరీ విల్లా

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ దాకా ప్రస్తుతం విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సోషల్ మీడియాలో వీరికి ఉన్న ఫాలోయింగ్ తో వీళ్ల బ్రాండ్ వాల్యూ అమాంతం పెరిగిపోయింది. ఒక చిన్న ట్వీట్ వేసినా ఫోటో పెట్టినా క్షణాల్లో వైరల్ అవుతుంది. గతంలో ఒక బ్రాండ్ ప్రమోషన్ కోసం వీళ్లిద్దరూ కలిసి చేసిన యాడ్ ఎంత పెద్ద రీచ్ తెచ్చుకుందో ట్రేడ్ వర్గాలకు బాగా తెలుసు. ఇండియాలో టాప్ సెలబ్రెటీ కపుల్స్ లో ఒకరిగా మంచి గుర్తింపు అందుకుంటున్నారు. ఇప్పుడు ఈ హిట్ పెయిర్ ఒక భారీ పెట్టుబడితో ఒక ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ సెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లోని ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి బంధువు నిర్మిస్తున్న అత్యంత ఖరీదైన ఎక్స్ క్లూజివ్ గేటెడ్ కమ్యూనిటీలో విజయ్, రష్మిక కలిసి ఒక విలాసవంతమైన విల్లాను కొనుగోలు చేశారట. ఈ లీక్స్ బయటకు వచ్చినప్పటి నుంచి అసలు ఈ భారీ ఇన్వెస్ట్మెంట్ వెనుక ఉన్న ప్లాన్ ఏంటనే ఆసక్తి ఇండస్ట్రీ సర్కిల్స్ లో మొదలైంది. విల్లా కొనుగోలు వెనుక ఫ్యామిలీ యాంగిల్ కూడా బలంగా వినిపిస్తోంది. సాధారణంగా విజయ్, రష్మిక ఇద్దరికీ జాయింట్ ఫ్యామిలీ సెటప్ అంటే చాలా ఇష్టం. ఇప్పటికే విజయ్ తన తల్లిదండ్రులు, తమ్ముడు ఆనంద్ తో పాటు కలిసి ఉండేందుకు జూబ్లీహిల్స్ లో ఒక పెద్ద ఇల్లు కట్టించాడు. వాళ్లంతా ఒకే ఇంట్లో ఎంతో అన్యోన్యంగా ఉంటున్నారు. రష్మిక సైతం ఆ ఫ్యామిలీతో ఎంత క్లోజ్ గా ఉంటుందో అందరూ చూస్తూనే ఉన్నారు. అందరూ ఒకేచోట కలిసి ఉండాలనేది వీళ్ల ఆలోచన. ఇప్పుడు ఉన్న ఇండివిడ్యువల్ హౌస్ నుంచి కొత్త విల్లా కొనుగోలు చేయడానికి ప్రధానంగా రెండు ప్రాక్టికల్ కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దీనిని పక్కా ఇన్వెస్ట్మెంట్ కోణంలో చూసి ఉండొచ్చు. లేదా రాబోయే రోజుల్లో కుటుంబం అంతా కలిసి ఆ లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీకి పూర్తిగా షిఫ్ట్ అయ్యే ఆలోచన అయినా ఉండి ఉండొచ్చు.

## ఉన్న డబ్బు చాలు: డైసీ బోపన్న

కన్నడ చిత్ర పరిశ్రమతో పాటు పలు భాషల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి డైసీ బోపన్న చాలా కాలం తర్వాత రీఎంట్రీ ఇస్తున్నారు. కాలక్షేపం కోసం .. ఆర్థిక అవసరాల కోసం మళ్లీ నటనారంగంలోకి రాలేదని ఆమె స్పష్టం చేశారు. తన వద్ద సరిపడా డబ్బు ఉందని, కేవలం మంచి పాత్రలు, బలమైన స్క్రిప్ట్ నచ్చడం వల్లే మళ్లీ కెమెరా ముందుకు వస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో డైసీ రీఎంట్రీ వెనుక ఉన్న అసలు కారణాలను పంచుకున్నారు. గతంలో సినిమాలకు దూరంగా ఉండటానికి కారణాలు రివీల్ చేసారు. మూస పద్ధతిలో సాగే పాత్రలు .. ప్రాధాన్యం లేని గ్లామర్ రోల్స్‌లో నటించడానికి ఇష్టపడలేదని డైసీ తెలిపారు. నటిగా తనలోని సత్తా చాటుకునేలా, విభిన్నమైన ఛాలెంజింగ్ పాత్రలు వస్తేనే చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రీఎంట్రీ ఇచ్చే క్రమంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోలేదని, తన మనసుకు నచ్చిన కథలను మాత్రమే ఎంచుకుంటున్నట్లు స్పష్టం చేశారు.



## అనుపమ.. తికమక!

మలయాళ ప్రేమమ్ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టి తక్కువ సమయంలోనే సౌత్‌లోని అన్ని భాషల్లో నటించి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. ఇండస్ట్రీలో హీరోయిన్‌గా అడుగు పెట్టి దశాబ్ద కాలం దాటింది. ఈ పదేళ్లలో అనుపమ ఎన్నో విజయాలు, అంతకు మించిన పరాజయాలు చవిచూసింది. అయితే ఈ మధ్య కాలంలో ఆమె తీవ్రమైన గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు అనిపిస్తుంది. ఆమె సినిమాల ఎంపిక విషయంలో నిర్ణయాలను కొందరు కన్ఫ్యూజ్ అవుతుంది అంటూ విమర్శిస్తున్నారు. ఒక వైపు హీరోలతో కమర్షియల్ సినిమాలు చేస్తూనే మరో వైపు హీరోయిన్ ఓరియంటెడ్ మూవీస్ ను చేయడం ఏంటంటూ చాలా మంది ప్రశ్నిస్తున్నారు. గత కొంత కాలంగా అనుపమ పరమేశ్వరన్ సినిమాల ఎంపిక ఇప్పుడు చర్చనీయాంశంగా మారడంతో ఆమె తీరును కొందరు తప్పుబడుతున్నారు. సాధారణంగా హీరోయిన్స్ కమర్షియల్ సినిమా ఆఫర్లు వచ్చేప్పుడు, స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు వచ్చేప్పుడు లేడీ ఓరియంటెడ్ సినిమాలకు దూరంగా ఉంటారు. ఎప్పుడైతే హీరోలకు జోడీగా ఆఫర్లు రావో అప్పుడే లేడీ ఓరియంటెడ్ సినిమాల వైపు చూడటం పరిపాటిగా వస్తుంది. ఈతరం హీరోయిన్స్, అంతకు ముందు హీరోయిన్స్ అంతా ఇదే ఫార్ములా ఫాలో అయ్యారు. కానీ అనుపమ పరమేశ్వరన్ మాత్రం ఒక వైపు హీరోలకు జోడీగా హీరోయిన్‌గా నటిస్తూ మరో వైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలను చేస్తూ వస్తోంది. ఒకటి రెండు అంటే పర్వాలేదు కానీ వరుసగా లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేయడంను అనుపమ పరమేశ్వరన్ అభిమానులు సైతం కొందరు తప్పుబడుతున్నారు. అందంతో పాటు మంచి క్రేజ్ ఉన్న ఈ సమయంలో కష్టపడి లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేయాల్సిన అవసరం ఏంటో అంటూ కొందరు ఆమెను ప్రశ్నిస్తున్నారు.



సౌత్ సినిమా ఇండస్ట్రీలో వరుస అవకాశాలతో దూసుకెళ్తున్న అందాల భామ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం మలయాళంలోకి గ్రాండ్‌గా అడుగుపెడుతోంది. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో, నేషనల్ అవార్డు గ్రహీత విష్ణు మోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఆపరేషన్ గంగా'లో ఆమె నటిస్తోంది. తాజాగా మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఒక బ్యూటిఫుల్ పిక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఆమె పెట్టిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు మరియు పౌరులను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మక 'ఆపరేషన్ గంగ' ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇక దేశభక్తి మరియు ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో సాగే ఈ కథపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. 'శ్రీ గోకులం మూవీస్' బ్యానర్‌పై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

## 'ఆపరేషన్ గంగ'లో భాగ్యశ్రీ





## అల్లు అర్జున్.. ఐకాన్‌జా!

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో అత్యాధునిక హంగులతో కూడిన సరికొత్త కార్యాలయాన్ని లాంచ్ చేసారు. తనదైన శైలిలో క్రియేటివ్ అప్రోచ్‌తో ముందుకు సాగుతున్న బన్నీ.. ఈ ఆఫీస్‌కు ×జూఙ్గీూ అని నామకరణం చేయడం ప్రస్తుతం సినీ వర్గాల్లో .. సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది. లెజెండరీ నటుడు, తన తాతయ్య పద్మశ్రీ అల్లు రామలింగయ్య జయంతి సందర్భంగా అక్టోబర్ 1న ఈ ఆఫీస్‌ను లాంచ్ చేయడం విశేషం. ఒక కొత్త ఆఫీస్... ఒక కొత్త ప్రారంభం.

సాధారణంగా ఏ హీరో అయినా ఏ హీరోయిన్ అయినా ఈ స్థాయిలో గుర్తింపు, బ్యాక్ టు బ్యాక్ కమర్షియల్ బ్లాక్ బస్టర్ హిట్స్ పడితే ఆగుతారా... పారితోషికం పెంచేస్తారు. అందరిలాగే మమిత బైజు తన పారితోషికంను పెంచేసింది అంటూ మలయాళం మీడియాలో కథనాలు వచ్చాయి. ఆ మధ్య తెలుగు మీడియాలోనూ ఒక టాలీవుడ్ మూవీ కోసం మమిత బైజు భారీ పారితోషికం డిమాండ్ చేసింది

## మమిత పారితోషికం డిమాండ్లు!

అంటూ వార్తలు వచ్చాయి. తమిళ్‌లోనూ ఈమె పారితోషికం గురించి కథనాలు వచ్చినట్లు సమాచారం. మీడియం రేంజ్ నిర్మాతలకు అందనంత ఎత్తులో మమిత బైజు నిల్చుందని, ఆమెను అందుకోవాలంటే పెద్ద నిర్మాతలు, పెద్ద హీరోలకు మాత్రమే సాధ్యం అన్నట్లుగా మమిత గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ అవన్నీ వాస్తవం కాదని, మీడియాలో వస్తున్న మమిత పారితోషికం వార్తలు కేవలం పుకార్లే అని ఆమె సన్నిహితులు చెబుతున్నారు.



## శ్రీకాంత్ ఓదెల మోసం చేశాడు: మోహన్‌బాబు

టాలీవుడ్ సీనియర్ నటుడు, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, దర్శకుడు శ్రీకాంత్ ఓదెలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపుదిద్దుకుని మిక్స్ టాక్‌తో రన్ అవుతోన్న 'ప్యారడైజ్' మూవీకి సంబంధించి ఇటీవల






ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, దర్శకుడు తనను మోసం చేశాడని కామెంట్ చేశారు. 'ప్యారడైజ్' సినిమాలో తన పాత్ర రూపకల్పన గురించి మోహన్ బాబు ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమా ప్రారంభంలో కథ చర్చల సమయంలో తనకు జోడీగా ఓ హీరోయిన్ పాత్ర ఉంటుందని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల చెప్పారని ఆయన గుర్తుచేసుకున్నారు. అయితే, తీరా షూటింగ్ ప్రారంభమైన తర్వాత ఆ పాత్ర అసలు లేనే లేదని దర్శకుడు చెప్పడంతో ఆశ్చర్యపోయానని అన్నారు. 'ముందుగా నాకు జోడీగా హీరోయిన్ ఉంటుందని చెప్పి, ఆ తర్వాత షూటింగ్‌లో ఆ పాత్ర లేదని చెప్పడం మోసం కాదా?' అంటూ సరదాగా మోహన్ బాబు గుర్తుచేసుకున్నారు.



# 2027 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

## అక్టోబర్ 10న భారత్-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల క్రికెట్ వన్డే ప్రపంచకప్ 2027 షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) గురువారం విడుదల చేసింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ సరికొత్త ఫార్మాట్‌తో అభిమానులను అలరించనుంది.

2023 ఫైనల్‌కు పునరావృతంగా, అక్టోబర్ 7న కేప్‌టౌన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. అయితే, గ్రూప్ స్టేజ్‌కు మాత్రం 12 జట్లే అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా అర్హత పొందాయి. వీటితో పాటు, 2026 సెప్టెంబర్ 30 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచిన జట్లు కూడా నేరుగా క్వాలిఫై అవుతాయి. దీంతో మొత్తం 10 జట్లు ఖరారవుతాయి. మిగిలిన రెండు స్థానాల కోసం క్వాలిఫయర్ టోర్నమెంట్ నిర్వహిస్తారు. ఈ క్వాలిఫయర్‌లో గెలిచిన జట్టు నేరుగా గ్రూప్ స్టేజ్‌కు చేరుకుంటుంది. ఇక క్వాలిఫయర్‌లో 2, 3, 4 స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య 'సూపర్ సిరీస్' జరుగుతుంది. ఈ మూడు జట్ల మధ్య జరిగే రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల తర్వాత, అగ్రస్థానంలో నిలిచిన జట్టు గ్రూప్ స్టేజ్‌లో చివరిదైన 12వ జట్టుగా అర్హత సాధిస్తుంది. క్వాలిఫయర్స్‌లో ఓడిపోయిన మిగతా రెండు జట్లు టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి.

### గ్రూప్ స్టేజ్ నుంచి సూపర్ 7 వరకు..

గ్రూప్ స్టేజ్‌లో మొత్తం 12 జట్లను ఆరు చొప్పున రెండు గ్రూపులుగా (గ్రూప్ ఏ, గ్రూప్ బీ) విభజిస్తారు. ప్రతి జట్టు తమ గ్రూపులోని మిగతా ఐదు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్ దశ ముగిసేసరికి, రెండు గ్రూపులలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు (3ం3=6) నేరుగా తదుపరి దశ అయిన 'సూపర్ 7'కు అర్హత సాధిస్తాయి. ఇక ఏడో జట్టు ఎంపిక ఆసక్తికరంగా ఉంటుంది. రెండు గ్రూపుల్లో నాలుగో స్థానంలో నిలిచిన జట్లను పోలుస్తారు. ఈ రెండింటిలో ఏ జట్టుకు ఎక్కువ పాయింట్లు ఉంటే, ఆ జట్టు ఏడో బెర్తును దక్కించుకుంటుంది. పాయింట్లు సమానంగా ఉంటే నెట్ రన్ రేట్ ఆధారంగా నిర్ణయిస్తారు. అంటే, గ్రూపులో నాలుగో స్థానంలో ఉన్నా టోర్నీలో ముందడుగు వేసే అవకాశం ఉంటుంది.

### ఏమిటీ 'సూపర్ 7'.. ప్రీ-సీడింగ్ అంటే ఏమిటి?

గ్రూప్ దశ ముగిశాక, ప్రతి గ్రూప్‌లోని టాప్-3 జట్లు, నాలుగో స్థానంలో నిలిచి రెండు గ్రూపుల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన ఒక జట్టుతో కలిపి మొత్తం ఏడు జట్లు 'సూపర్ 7' దశకు చేరుకుంటాయి. ఇదే ఈ వరల్డ్ కప్‌లో సరికొత్త ప్రయోగం. గ్రూప్ స్టేజ్ నుంచి వచ్చిన ఏడు జట్లు ఈ దశలో పోటీపడతాయి. ముఖ్యంగా, గ్రూప్ స్టేజ్‌లో సాధించిన పాయింట్లను ఇక్కడ పరిగణనలోకి తీసుకోరు. ప్రతి జట్టు సున్నా పాయింట్లతో ఈ దశను ప్రారంభిస్తుంది. సూపర్ 7లో ప్రతి జట్టు మిగిలిన ఆరు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. అభిమానులకు, ప్రసారదారులకు సౌలభ్యం కోసం ఐసీసీ 'ప్రీ-సీడింగ్' విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం, కొన్ని అగ్ర జట్లకు ముందుగానే సీడింగ్ కేటాయించారు. ఒకవేళ ఈ జట్లు సూపర్ 7కు అర్హత సాధిస్తే, వారికి కేటాయించిన సీడింగ్ ప్రకారమే మ్యాచ్‌లు జరుగుతాయి. ఒకవేళ సీడింగ్ ఉన్న జట్టు అర్హత సాధించలేకపోయి, ఆ స్థానంలో మరో జట్టు (సీడింగ్ లేనిది) వస్తే, ఆ కొత్త జట్టుకు పాత జట్టు సీడింగ్ వర్తిస్తుంది. దీనివల్ల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేకుండా మ్యాచ్‌లు సజావుగా సాగుతాయి.



### సెమీ-ఫైనల్స్ మరియు ఫైనల్

సూపర్ 7 దశ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో టాప్-4లో నిలిచిన జట్లు సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మొదటి స్థానంలోని జట్టు నాలుగో స్థానంలోని జట్టుతో ఒక సెమీస్ లో, రెండు-మూడు స్థానాల్లోని జట్లు మరో సెమీస్‌లో తలపడతాయి. సెమీ ఫైనల్స్‌లో గెలిచిన రెండు జట్లు ఫైనల్‌లో ప్రపంచ విజేతగా నిలిచేందుకు పోటీపడతాయి. సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే కూడా ఉంటుంది. ఈ కొత్త ఫార్మాట్ టోర్నీకి మరింత ఉత్కంఠను జోడిస్తుందని ఐసీసీ ఆశిస్తోంది.

### కీలక మ్యాచ్‌లు, నాకౌట్ దశ

క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ హై-వోల్టేజ్ మ్యాచ్ అక్టోబర్ 10న జోహన్నెస్‌బర్గ్‌లో జరగనుంది. ఆతిథ్య జట్లైన దక్షిణాఫ్రికా అక్టోబర్ 9న న్యూజిలాండ్‌తో, జింబాబ్వే అక్టోబర్ 11న ఆఫ్ఘనిస్థాన్‌తో తమ ప్రస్థానాన్ని ప్రారంభిస్తాయి. తొలి సెమీఫైనల్ నవంబర్ 17న కేప్‌టౌన్‌లో, రెండో సెమీఫైనల్ నవంబర్ 18న ష్వానేలో జరుగుతాయి. ఇక, విశ్వవిజేతను తేల్చే ఫైనల్ మ్యాచ్ నవంబర్ 21న జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో జరగనుంది. సెమీస్, ఫైనల్స్‌కు రిజర్వ్ డేలను కూడా కేటాయించారు. ఈ షెడ్యూల్ ప్రకటనపై ఐసీసీ ఛైర్మన్ జై షా మాట్లాడుతూ, "ఈ షెడ్యూల్ ప్రకటన, టికెట్ల కేటాయింపు ప్రారంభం కావడం టోర్నమెంట్ సన్నాహాల్లో కీలక మైలురాళ్లు. మూడు దేశాలు క్రికెట్ అభిమానులకు అద్భుతమైన అనుభూతిని అందిస్తాయని ఆశిస్తున్నాం," అని తెలిపారు.



## ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్ 2027 పూర్తి షెడ్యూల్:

**సూపర్ సిరీస్**

- అక్టోబర్ 2, శనివారం: క్వాలిఫయర్ 1 వర్సెస్ క్వాలిఫయర్ 3 - విండ్‌హోక్
- అక్టోబర్ 4, సోమవారం: క్వాలిఫయర్ 1 వర్సెస్ క్వాలిఫయర్ 2 - విండ్‌హోక్
- అక్టోబర్ 6, బుధవారం: క్వాలిఫయర్ 2 వర్సెస్ క్వాలిఫయర్ 3 - విండ్‌హోక్

**గ్రూప్ స్టేజ్**

- అక్టోబర్ 7, గురువారం: భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా - కేప్‌టౌన్
- అక్టోబర్ 8, శుక్రవారం: పాకిస్థాన్ వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ - ష్వానే
- అక్టోబర్ 8, శుక్రవారం: ఇంగ్లండ్ వర్సెస్ బంగ్లాదేశ్ - విండ్‌హోక్
- అక్టోబర్ 9, శనివారం: జింబాబ్వే వర్సెస్ క్వాలిఫయర్ ఏ - బులవాయో
- అక్టోబర్ 9, శనివారం: దక్షిణాఫ్రికా వర్సెస్ న్యూజిలాండ్ - కేప్‌టౌన్
- అక్టోబర్ 10, ఆదివారం: భారత్ వర్సెస్ పాకిస్థాన్ - జోహన్నెస్‌బర్గ్
- అక్టోబర్ 10, ఆదివారం: శ్రీలంక వర్సెస్ క్వాలిఫయర్ బీ - విండ్‌హోక్
- అక్టోబర్ 11, సోమవారం: జింబాబ్వే వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ - బులవాయో
- అక్టోబర్ 12, మంగళవారం: ఆస్ట్రేలియా వర్సెస్ క్వాలిఫయర్ ఏ - పార్ల్
- అక్టోబర్ 12, మంగళవారం: న్యూజిలాండ్ వర్సెస్ బంగ్లాదేశ్ - కుగొంపో సిటీ
- అక్టోబర్ 13, బుధవారం: ఇంగ్లండ్ వర్సెస్ శ్రీలంక - విండ్‌హోక్
- అక్టోబర్ 13, బుధవారం: దక్షిణాఫ్రికా వర్సెస్ క్వాలిఫయర్ బీ - పార్ల్
- అక్టోబర్ 14, గురువారం: భారత్ వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ - ష్వానే
- అక్టోబర్ 15, శుక్రవారం: పాకిస్థాన్ వర్సెస్ క్వాలిఫయర్ ఏ - బ్లూమ్‌ఫోంటెన్
- అక్టోబర్ 15, శుక్రవారం: జింబాబ్వే వర్సెస్ ఆస్ట్రేలియా - హరారే
- అక్టోబర్ 16, శనివారం: శ్రీలంక వర్సెస్ బంగ్లాదేశ్ - డర్బన్
- అక్టోబర్ 16, శనివారం: దక్షిణాఫ్రికా వర్సెస్ ఇంగ్లండ్ - గెబెర్హా
- అక్టోబర్ 17, ఆదివారం: భారత్ వర్సెస్ క్వాలిఫయర్ ఏ - బ్లూమ్‌ఫోంటెన్
- అక్టోబర్ 17, ఆదివారం: న్యూజిలాండ్ వర్సెస్ క్వాలిఫయర్ బీ - హరారే
- అక్టోబర్ 18, సోమవారం: ఆస్ట్రేలియా వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ - కుగొంపో సిటీ
- అక్టోబర్ 19, మంగళవారం: జింబాబ్వే వర్సెస్ పాకిస్థాన్ - హరారే
- అక్టోబర్ 19, మంగళవారం: దక్షిణాఫ్రికా వర్సెస్ బంగ్లాదేశ్ - డర్బన్
- అక్టోబర్ 20, బుధవారం: న్యూజిలాండ్ వర్సెస్ శ్రీలంక - జోహన్నెస్‌బర్గ్
- అక్టోబర్ 20, బుధవారం: ఇంగ్లండ్ వర్సెస్ క్వాలిఫయర్ బీ - హరారే
- అక్టోబర్ 21, గురువారం: ఆఫ్ఘనిస్థాన్ వర్సెస్ క్వాలిఫయర్ ఏ - కుగొంపో సిటీ
- అక్టోబర్ 22, శుక్రవారం: ఆస్ట్రేలియా వర్సెస్ పాకిస్థాన్ - పార్ల్
- అక్టోబర్ 22, శుక్రవారం: దక్షిణాఫ్రికా వర్సెస్ శ్రీలంక - జోహన్నెస్‌బర్గ్
- అక్టోబర్ 23, శనివారం: ఇంగ్లండ్ వర్సెస్ న్యూజిలాండ్ - గెబెర్హా
- అక్టోబర్ 23, శనివారం: బంగ్లాదేశ్ వర్సెస్ క్వాలిఫయర్ బీ - ష్వానే
- అక్టోబర్ 24, ఆదివారం: జింబాబ్వే వర్సెస్ భారత్ - విక్టోరియా ఫాల్స్

**సూపర్ 7 స్టేజ్: సీడెడ్ జట్ల షెడ్యూల్**

అభిమానుల సౌలభ్యం, ప్రయాణ ప్రణాళికల కోసం ఐసీసీ కొన్ని జట్లకు ముందుగానే సీడింగ్ కేటాయించింది. ఒకవేళ సీడెడ్ జట్టు అర్హత సాధించకపోతే, దాని స్థానంలో క్వాలిఫై అయిన జట్టు ఆ సీడింగ్‌ను తీసుకుంటుంది. సూపర్ 7 దశలో సీడెడ్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌ల షెడ్యూల్ కింద ఇవ్వబడింది.

- అక్టోబర్ 25: ఏ2 (ఆస్ట్రేలియా) వర్సెస్ బీ3 (శ్రీలంక) - జోహన్నెస్‌బర్గ్
- అక్టోబర్ 26: బీ1 (న్యూజిలాండ్) వర్సెస్ ఏ3 (పాకిస్థాన్) - గెబెర్హా
- అక్టోబర్ 27: బీ2 (దక్షిణాఫ్రికా) వర్సెస్ ఏబీ4 (ఇంగ్లండ్) - ష్వానే
- అక్టోబర్ 28: ఏ1 (భారత్) వర్సెస్ ఏ2 (ఆస్ట్రేలియా) - విక్టోరియా ఫాల్స్
- అక్టోబర్ 29: బీ1 (న్యూజిలాండ్) వర్సెస్ బీ3 (శ్రీలంక) - కుగొంపో సిటీ
- అక్టోబర్ 30: ఏ3 (పాకిస్థాన్) వర్సెస్ ఏబీ4 (ఇంగ్లండ్) - విక్టోరియా ఫాల్స్
- అక్టోబర్ 31: బీ2 (దక్షిణాఫ్రికా) వర్సెస్ ఏ1 (భారత్) - జోహన్నెస్‌బర్గ్
- నవంబర్ 1: ఏ2 (ఆస్ట్రేలియా) వర్సెస్ బీ1 (న్యూజిలాండ్) - విక్టోరియా ఫాల్స్
- నవంబర్ 2: బీ3 (శ్రీలంక) వర్సెస్ ఏబీ4 (ఇంగ్లండ్) - కేప్ టౌన్
- నవంబర్ 3: బీ2 (దక్షిణాఫ్రికా) వర్సెస్ ఏ3 (పాకిస్థాన్) - డర్బన్
- నవంబర్ 4: ఏ1 (భారత్) వర్సెస్ బీ1 (న్యూజిలాండ్) - పార్ల్
- నవంబర్ 5: ఏ2 (ఆస్ట్రేలియా) వర్సెస్ ఏబీ4 (ఇంగ్లండ్) - డర్బన్
- నవంబర్ 6: బీ2 (దక్షిణాఫ్రికా) వర్సెస్ బీ3 (శ్రీలంక) - బ్లూమ్‌ఫోంటెన్
- నవంబర్ 7: ఏ1 (భారత్) వర్సెస్ ఏ3 (పాకిస్థాన్) - కేప్ టౌన్
- నవంబర్ 8: బీ1 (న్యూజిలాండ్) వర్సెస్ ఏబీ4 (ఇంగ్లండ్) - డర్బన్
- నవంబర్ 9: బీ2 (దక్షిణాఫ్రికా) వర్సెస్ ఏ2 (ఆస్ట్రేలియా) - గెబెర్హా
- నవంబర్ 10: ఏ3 (పాకిస్థాన్) వర్సెస్ బీ3 (శ్రీలంక) - బ్లూమ్‌ఫోంటెన్
- నవంబర్ 11: ఏ1 (భారత్) వర్సెస్ ఏబీ4 (ఇంగ్లండ్) - గెబెర్హా
- నవంబర్ 12: బీ2 (దక్షిణాఫ్రికా) వర్సెస్ బీ1 (న్యూజిలాండ్) - కేప్ టౌన్
- నవంబర్ 13: ఏ2 (ఆస్ట్రేలియా) వర్సెస్ ఏ3 (పాకిస్థాన్) - బ్లూమ్‌ఫోంటెన్
- నవంబర్ 14: ఏ1 (భారత్) వర్సెస్ బీ3 (శ్రీలంక) - డర్బన్

**సెమీ ఫైనల్స్**

- నవంబర్ 17, బుధవారం: సెమీ-ఫైనల్ 1 - కేప్‌టౌన్
- నవంబర్ 18, గురువారం: సెమీ-ఫైనల్ 2 - ష్వానే

**ఫైనల్**

- నవంబర్ 21, ఆదివారం: ఫైనల్ - జోహన్నెస్‌బర్గ్

## 2027 వరల్డ్ కప్ నా లక్ష్యం: రోహిత్ శర్మ

టీమిండియా సీనియర్ ఓపెనర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తన భవిష్యత్ ప్రణాళికలపై పూర్తి స్పష్టత ఇచ్చాడు. 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే తన దీర్ఘకాలిక ఆశయాన్ని బయటపెట్టాడు. అయితే, సుదీర్ఘ లక్ష్యాల గురించి ఎక్కువగా ఆలోచించకుండా, వర్తమానంపై దృష్టి సారించి, ఫిట్‌గా ఉంటూ, నిలకడగా రాణించడమే తన వ్యూహమని పేర్కొన్నాడు. ఇటీవల గౌహతిలో వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో రోహిత్ (101) అద్భుత శతకంతో ఫామ్‌లోకి వచ్చిన విషయం తెలిసిందే. జియోస్టార్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రోహిత్ మాట్లాడుతూ, "2027 వరకు నన్ను నేను సమర్థుడిగా ఉంచుకోవాలనుకుంటున్నాను. అందుకోసం ఫిట్‌గా ఉండాలి, కష్టపడాలి, ప్రతీ టోర్నమెంట్‌లోనూ రాణించాలి. ప్రస్తుతం నా ముందున్న మ్యాచ్‌లపై దృష్టి పెడితేనే ముందుకు సాగగలను. నా



ప్రయాణంలో ఎలాంటి మార్పులు చేసుకోనవసరం లేదు. ఇదే పంథాలో ముందుకు వెళతాను" అని వివరించాడు. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాయకత్వంపై రోహిత్ ప్రశంసలు కురిపించాడు. "శుభ్‌మన్‌కు అద్భుతమైన క్రికెట్ పరిజ్ఞానం ఉంది. అతడు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది మాత్రమే అయింది. కాబట్టి అతడిని అప్పుడే అంచనా వేయడం సరికాదు. కానీ, మైదానంలో అతడికి ఏం కావాలో పూర్తి స్పష్టత ఉంది. ఒక కెప్టెన్‌కు ఇది చాలా ముఖ్యమైన లక్షణం. గిల్‌కు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని భరోసా ఇచ్చాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకున్నంత మాత్రాన జట్టుకు దూరంగా ఉండనని, గిల్‌తో తన అనుబంధం ఎప్పటిలాగే కొనసాగుతుందని స్పష్టం చేశాడు. తన కెరీర్‌లో రెండుసార్లు (2007, 2024) టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, "భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. ఆ ఫీలింగ్‌ను మాటల్లో వర్ణించలేం. 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచినప్పుడు దాని విలువేంటో తెలిసింది. ఆ అనుభూతిని మళ్లీ పొందాలనుకుంటున్నాను. అందుకే రాబోయే వన్డే ప్రపంచకప్ గెలవడం నాకు చాలా ముఖ్యం" అని రోహిత్ తన అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేశాడు. శనివారం న్యూ చండీగఢ్‌లో జరగనున్న మూడో వన్డేలో కూడా రోహిత్ నుంచి మరో అద్భుత ప్రదర్శనను అభిమానులు ఆశిస్తున్నారు.




## మూడో వన్డేకు ప్రసిద్ధ్ కృష్ణ దూరం

వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఉన్న భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. కీలక పేస్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ తొడ కండరాల గాయం (హ్యామ్‌స్ట్రింగ్) కారణంగా మూడో వన్డేకు దూరమయ్యాడు. అతని స్థానంలో యువ పేసర్ అన్షుల్ కంబోజ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. గువహటి వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. బౌలింగ్ చేస్తున్న సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ అసౌకర్యంగా కనిపించాడు. తన తొలి స్పెల్‌లో నాలుగు ఓవర్లు వేసిన అతను, 31వ ఓవర్ వేసిన తర్వాత మైదానం వీడాడు. మొత్తం మీద కేవలం ఐదు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయడంతో, అతని స్థానంలో జట్టు యాజమాన్యం పార్ట్ టైమ్ బౌలర్ నమన్ ధిర్‌తో బౌలింగ్ చేయించాల్సి వచ్చింది. గాయం తీవ్రతను అంచనా వేసేందుకు ప్రసిద్ధ్ కృష్ణను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పంపనున్నారు. అక్కడ జరిపే స్కాన్‌ల ఆధారంగా అతను కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందనే దానిపై స్పష్టత రానుంది. "ప్రసిద్ధ్ మూడో వన్డే ఆడటం లేదు. తదుపరి పరీక్షల కోసం అతను బెంగళూరు వెళతాడు. ప్రస్తుతానికి అతని స్థానంలో కంబోజ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది" అని బీసీసీఐ వర్గాలు గురువారం ఓ వార్తా సంస్థకు తెలిపాయి. అన్షుల్ కంబోజ్‌ను, ప్రస్తుతం పుదుచ్చేరిలో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో జరుగుతున్న మ్యాచ్ నుంచి బీసీసీఐ వెనక్కి పిలిపించింది. ఆ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు తీసిన కంబోజ్, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం రెండు ఓవర్లు వేసిన అనంతరం, అతడికి తాజా సమాచారం అందించారు. దాంతో అతడు భారత జట్టుతో చేరేందుకు బయలుదేరాడు. ప్రసిద్ధ్ గాయం కేవలం ఈ సిరీస్‌కే కాకుండా, త్వరలో జరగనున్న న్యూజిలాండ్ పర్యటనపైనా ఆందోళన కలిగిస్తోంది. ఆ పర్యటనలో ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఉన్న నేపథ్యంలో ప్రసిద్ధ్ వంటి కీలక బౌలర్ లభ్యత జట్టుకు చాలా ముఖ్యం.

ఈవార్తలు ప్రజావాణి
శుక్రవారం 2-10-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# ఓటు కాదు.. ఎన్నికలే బోగస్!

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది సామాన్యుడి చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం. డబ్బు ఉండకపోవచ్చు.. అధికారం ఉండకపోవచ్చు.. పలుకుబడి లేకపోవచ్చు.. కానీ తన ఓటుతో పాలకుడిని ఎన్నుకునే హక్కు మాత్రం ప్రతి పౌరుడికీ ఉంటుంది. అందుకే ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగలుగా చెప్పుకుంటాం. కానీ అదే ఎన్నికలపై ప్రజల్లో అనుమానాలు పెరిగితే? ఓటు వేసిన తర్వాత తమ ఓటు విలువ ఏమైందో తెలియని పరిస్థితి వస్తే? అప్పుడు సామాన్యుడి ఆవేదన ఎలా ఉంటుంది? “ఓటు కాదు.. ఎన్నికలే బోగస్” అనే మాటలో ఒక సామాన్యుడి ఆక్రోశం దాగి ఉంది. ఇది కేవలం ఒక రాజకీయ నినాదంగా చూడాల్సిన విషయం కాదు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం ఎంత బలంగా ఉంది? తమ ఓటు నిజంగా లెక్కలోకి వస్తుందనే నమ్మకం వారికి ఉందా? ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సమాన అవకాశాలు లభిస్తున్నాయా? డబ్బు, మద్యం, కులం, మతం, అధికార ప్రభావం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయనే భావన ప్రజల్లో ఎందుకు ఏర్పడుతోంది? వంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన అవసరం ఉంది. ఓటు వేయడానికి ముందు రాజకీయ పార్టీలు ప్రజల ముందుకు వస్తాయి. హామీలు ఇస్తాయి. మేనిఫెస్టోలు ప్రకటిస్తాయి. ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెబుతాయి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత అదే ప్రజలు తమ సమస్యలతో మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే ఎన్నికల వ్యవస్థపై నిరాశ కలగడం సహజం. ఎన్నికల సమయంలో కనిపించే ప్రజాసేవ భావన, ఎన్నికల తర్వాత కూడా కొనసాగితేనే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుంది. మరోవైపు ఎన్నికల నిర్వహణలో పారదర్శకతపై ఏ చిన్న సందేహం వచ్చినా దానికి స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత వ్యవస్థలపై ఉంటుంది. ఓటరు జాబితాలో పేర్లు, ఓట్ల లెక్కింపు, పోలైన ఓట్ల సంఖ్య, తిరస్కరించిన ఓట్లు, ఫలితాల ప్రక్రియ వంటి ప్రతి అంశంపై ప్రజలకు అందుబాటులో ఉండే సమాచారం అవసరం. అనుమానాలకు తావులేని విధంగా వ్యవస్థ పనిచేస్తేనే ప్రజల విశ్వాసం నిలుస్తుంది. ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతి అభ్యర్థి ఫలితాన్ని ప్రశ్నించడం ఒక విషయం. కానీ ఎన్నికల వ్యవస్థపై సాధారణ ఓటరే నమ్మకం కోల్పోవడం మరో విషయం. రెండోది ప్రజాస్వామ్యానికి మరింత తీవ్రమైన హెచ్చరిక. అందుకే ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, సమాన అవకాశాలు, నిష్పాక్షికతపై నిరంతర చర్చ అవసరం. సామాన్యుడికి కావాల్సింది పెద్ద పెద్ద రాజకీయ ప్రసంగాలు కాదు. తన ఓటుకు విలువ ఉందనే నమ్మకం. తాను వేసిన ఓటు సురక్షితంగా ఉందనే భరోసా. ఎన్నికల్లో గెలిచినవారు తనకు కూడా ప్రతినిధులేననే భావన. ఎన్నికల్లో ఓడిపోయినవారూ ప్రజల తీర్పును గౌరవించే రాజకీయ సంస్కారం. ఎన్నికలు కేవలం ఐదేళ్లకోసారి జరిగే ఓటింగ్ ప్రక్రియ కాదు. అవి ప్రజలకు అధికారాన్ని అప్పగించే రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ. అందుకే ఆ వ్యవస్థపై అనుమానం ఏర్పడితే దాన్ని అణచివేయడం కాదు.. అనుమానాలకు కారణమైన అంశాలను పారదర్శకంగా పరిశీలించడం అవసరం. “నా ఓటు ఎక్కడికి వెళ్లింది?” అని ఒక సామాన్యుడు ప్రశ్నించినప్పుడు, అతనిని అనుమానించడం కాదు.. అతని ప్రశ్నకు సమాధానం చెప్పాలి. “నా ఓటుకు విలువ ఉందా?” అని అడిగినప్పుడు, రాజకీయ నాయకుల మాటలకంటే ఎన్నికల వ్యవస్థ పనితీరే సమాధానం కావాలి. ప్రజాస్వామ్యానికి అసలు ప్రమాదం ఓటరు ఓటు వేయకపోవడం మాత్రమే కాదు. ఓటు వేసినా ప్రయోజనం లేదనే భావన ఓటరులో ఏర్పడటం. ఆ భావన బలపడితే ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజలతో ఉన్న బంధమే బలహీనపడుతుంది. అందుకే సామాన్యుడి ఆక్రోశాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. “ఓటు కాదు.. ఎన్నికలే బోగస్” అనే ఆవేదన ఎందుకు వినిపిస్తోందో ఆలోచించాలి. ఎన్నికలపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడానికి ఏం చేయాలనే దానిపై రాజకీయ పార్టీలు, ఎన్నికల సంస్థలు, పౌర సమాజం, మీడియా కలిసి చర్చించాలి. ఎందుకంటే ఓటు ఒక కాగితం ముక్క కాదు.. ఒక పౌరుడి నమ్మకం. ఆ నమ్మకమే ప్రజాస్వామ్యానికి పునాది. ఆ పునాదే కదిలితే అధికారంలో ఎవరు ఉన్నారన్నది కాదు.. ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందన్నదే అసలు ప్రశ్న.

# విమలక్క గజ్జె... కొత్త చరణం మోగాలి!

యాభై ఏళ్ల పాటకు పండుగ ముగిసిందా? యాభై గంటల ప్రజా కళాజాతర ముగిసిందా? వేదికలు ఖాళీ అయ్యాయి.. దరువులు ఆగాయి.. కళాకారులు తమ ఇళ్లకు చేరుకున్నారు.. కానీ యాభై ఏళ్లుగా ప్రజల మధ్య మోగిన ఒక గొంతుకు ముగింపు ఉంటుందా? విమలక్క పాట అనేది కేవలం గానం కాదు.. ఒక కాలాన్ని మరో కాలంతో కలిపిన సాంస్కృతిక జ్ఞాపకం. ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో అరుణోదయ విమలక్క యాభై ఏళ్ల ప్రస్థానం సందర్భంగా సెప్టెంబరు 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో యాభై గంటల ప్రజా కళాజాతర జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా పాటలు, జానపద కళారూపాలు, చర్చలు, ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. ఆమె చిన్ననాటి నుంచే ప్రజా పాటల వాతావరణంలో పెరిగి, దశాబ్దాలుగా సాంస్కృతిక రంగంలో కొనసాగినట్లు ప్రచురిత వివరాలు చెబుతున్నాయి. అయితే అసలు ప్రశ్న ఇప్పుడు మొదలవుతోంది.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు, 9133947176

యాభై ఏళ్లు పాడిన గొంతు.. ఇక ముందు ఏం పాడాలి? గతంలో దోపిడీ, ఆధిపత్యం, అసమానతలను ప్రశ్నించిన పాటలు ఒక తరం చైతన్యానికి తోడయ్యాయి. తెలంగాణ ఉద్యమంలోనూ పాట, మాట, ఆట, కళ ప్రజలను కదిలించిన సాధనాలుగా నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాలం మారింది. సమస్యల రూపాలు మారాయి. పాత సమస్యలతో పాటు కొత్త సమస్యలు వచ్చాయి. భూమి హక్కులు, ఉపాధి, విద్య, ప్రజాధనం వినియోగం, ప్రభుత్వ సేవలు ఒకవైపు ఉంటే.. మరోవైపు యువత ముందున్న మత్తు పదార్థాల ముప్పు, అతిగా ఫోన్ వాడకం, సామాజిక మాధ్యమాల మోజు, కుటుంబ బంధాల సడలింపు, ఒంటరితనం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. అందుకే విమలక్క యాభై ఏళ్ల పాటకు కొత్త చరణం కావాలంటే అది కేవలం “ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి” అనే ఒక్క పల్లవితో ఆగిపోకూడదు. “మనల్ని మనం కూడా ప్రశ్నించుకోవాలి” అనే అంతరంగ స్వరం కూడా అందులో ఉండాలి. ప్రభుత్వం తప్పు చేస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాలి. సమాజం తప్పు చేస్తే సమాజం ఆలోచించాలి. తల్లిదండ్రులు తప్పు చేస్తే తమను తాము ప్రశ్నించుకోవాలి. యువత తప్పుదారి పడితే వారిని నిందించడం కాదు.. ఎందుకు ఆ దారి పట్టారో తెలుసుకోవాలి. మనం పిల్లలకు ఏ వాతావరణం ఇస్తున్నాం? ఏ విలువలు నేర్పుతున్నాం? మన చేతిలో ఎప్పుడూ ఫోన్ ఉంటే.. పిల్లల చేతిలో పుస్తకం ఎలా ఉంటుంది? మనం ఇంట్లో మాట్లాడుకోకపోతే.. పిల్లలు ఎవరితో మాట్లాడతారు? మనం చూపించే మార్గమే రేపటి తరానికి బాట కాదా? ఈ ప్రశ్నలతోనే విమలక్క గజ్జెకు కొత్త దరువు మొదలవ్వాలి.

నేడు యువత ముందున్న తీవ్రమైన సవాళ్లలో మత్తు పదార్థాల వ్యాప్తి ఒకటి. గంజాయి, మాదకద్రవ్యాలు, వాటి చుట్టూ ఏర్పడే అక్రమ వలయాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉందని ప్రభుత్వ యంత్రాంగం కూడా హెచ్చరిస్తోంది. 2025లో తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, పాఠశాలలు, కళాశాలల్లో అప్రమత్తత అవసరమని పేర్కొంది. యువతను సరైన దిశలో నడిపించేందుకు కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని కూడా ప్రభుత్వం ప్రస్తావించింది. కానీ చట్టం ఒక్కటే ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించగలదా? పోలీసులు అక్రమ సరఫరాను అడ్డుకోవాలి. తప్పు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో కుటుంబం తన బాధ్యతను గుర్తించాలి. పాఠశాల, కళాశాల తన బాధ్యతను తీసుకోవాలి. స్నేహితుడు తప్పుదారి పడుతున్నప్పుడు మౌనంగా ఉండకూడదు. గ్రామం తన యువతను కోల్పోతుంటే చూస్తూ ఉండకూడదు. ఒక యువకుడిని మత్తు నుంచి బయటకు తీయడం అంటే ఒక కుటుంబాన్ని కాపాడటం మాత్రమే కాదు.. ఒక తరాన్ని కాపాడటం. ఇక్కడ పాటకు గొప్ప శక్తి ఉంది.

ఉపన్యాసం వింటే కొంతసేపు గుర్తుండవచ్చు. కానీ పాటలో చెప్పిన మాట గుండెల్లో మిగిలిపోవచ్చు. అందుకే ఒక కొత్త చరణం ఇలా ఉండాలి–“గంజాయి కాదు గమ్యం.. మాదకద్రవ్యం కాదు మేధస్సు.. మత్తు కాదు మనసు.. మాయ కాదు మనిషి!” యువతను భయపెట్టడం కాదు.. బలపరచాలి. “నువ్వు తప్పు చేశావు” అని తలదించించడం కాదు.. “నీకింకా మంచి దారి ఉంది” అని చేయి పట్టాలి. ఉద్యోగం లేనివాడిని నిందించడం కాదు.. నైపుణ్యం నేర్పించాలి. చదువులో వెనుకబడినవాడిని ఎగతాళి చేయడం కాదు.. మళ్లీ చదివే అవకాశం ఇవ్వాలి. మానసికంగా ఒంటరిగా ఉన్న యువకుడిని బలహీనుడిగా చూడకూడదు.. అతని మాట వినాలి. ఒక పాట యువతను కదిలించగలదు. సరైన సమయంలో “ఆగు.. ఆలోచించు.. నీ జీవితం విలువైనది” అని చెప్పగలిగితే అది నిజమైన ప్రజా పాట.

విమలక్క వేదికపై నిలబడి పాడడం ఒక దశ. కానీ పల్లె గడప దాటి ప్రజల మధ్యకు వెళ్లి వారి మాట వినడం మరో దశ. ఒక గ్రామంలో రైతులతో కూర్చోవాలి. మరో గ్రామంలో యువతతో మాట్లాడాలి. ఇంకో గ్రామంలో మహిళల సమస్యలు వినాలి. పాఠశాలలో పిల్లలతో మాట్లాడాలి. కళాశాలలో యువతతో మత్తు పదార్థాల ప్రమాదం గురించి చర్చించాలి. కుటుంబాలతో ఫోన్ వినియోగంపై మాట్లాడాలి. పెద్దలతో పాత పల్లె బంధాల గురించి మాట్లాడాలి. ఒక గ్రామంలో మంచి పని జరిగితే దానిని పాటగా చెప్పాలి. ఒక గ్రామంలో సమస్య ఉంటే దాన్ని ప్రజా ప్రశ్నగా ముందుకు తీసుకురావాలి. అప్పుడు గజ్జె కేవలం వినిపించదు.. ప్రజల మాటను తిరిగి ప్రజలకే వినిపిస్తుంది. ఒక పల్లెలో పుట్టిన మంచి ఆలోచన మరో పల్లెకు వెళ్లాలి. ఒక యువకుడు మత్తును వదిలి చదువులోకి వస్తే అది మరో యువకుడికి స్ఫూర్తి కావాలి. ఒక కుటుంబం భోజన సమయంలో ఫోన్‌లు పక్కన పెట్టి అరగంట మాట్లాడడం ప్రారంభిస్తే అది మరో కుటుంబానికి ఉదాహరణ కావాలి. ఒక గ్రామం తమ ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుంటే మరో గ్రామం దానిని ఆదర్శంగా తీసుకోవాలి. ఒక యువత బృందం తమ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తే ఇంకో గ్రామం కూడా ఆలోచించాలి. ఇదే నిజమైన ప్రజా చైతన్యం. పాట విని చప్పట్లు కొట్టడం కాదు.. పాట విన్న తర్వాత మన జీవితంలో ఒక మంచి మార్పు రావడం. అదే గజ్జెకు అర్థం. అదే కళకు సార్థకత.

విమలక్క యాభై ఏళ్ల పాటకు నిజమైన నివాళి అంటే మరో సభ పెట్టడం మాత్రమే కాదు. ఆమె పాటల నుంచి కొత్త తరం ఏమి నేర్చుకుంటుందన్నదే అసలు ప్రశ్న. ఇప్పుడు కొత్త తరం చేతిలో కొత్త ప్రపంచం ఉంది. వారికి పాత పాటను వినిపించడమే కాదు.. కొత్త ప్రశ్నలను కూడా ఇవ్వాలి. “నీ భవిష్యత్తు ఎక్కడ?” “నీ సమయం ఎక్కడ ఖర్చవుతోంది?” “నీ ప్రతిభ ఎక్కడ ఉపయోగపడుతోంది?” “నీ కుటుంబంతో చివరిసారి ఎప్పుడు మనసారా మాట్లాడావు?” “నీ గ్రామానికి నువ్వేం చేశావు?” “నీ ప్రభుత్వాన్ని చివరిసారి ఏ ప్రశ్న అడిగావు?” “నీ హక్కు గురించి నీకు ఎంత తెలుసు?” “నీ బాధ్యత గురించి నీకు ఎంత తెలుసు?” ఈ ప్రశ్నలు యువతను కదిలిస్తే.. అదే కొత్త పాట. విమలక్క గజ్జె మళ్లీ మోగాలి అంటే యువత నడుం బిగించాలి. కానీ ఆ నడుం బిగింపు రాళ్లు ఎత్తడానికి కాదు.. పుస్తకం ఎత్తడానికి. మత్తు పదార్థాలను పట్టుకోవడానికి కాదు.. నైపుణ్యాన్ని పట్టుకోవడానికి. ద్వేషాన్ని పెంచడానికి కాదు.. సమాజాన్ని కలపడానికి. అబద్ధాలను పంచడానికి కాదు.. నిజాన్ని తెలుసుకోవడానికి. ప్రశ్నించకుండా ఉండడానికి కాదు.. ఆధారాలతో ప్రశ్నించడానికి. ఇదే కొత్త తరం ఉద్యమం కావాలి.

విమలక్క యాభై ఏళ్ల పాటకు ఇప్పుడు ఒక కొత్త దరువు అవసరం. ఆ దరువు “ప్రభుత్వాన్ని కూల్చాలి” అనే మాటలో కాదు.. “ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి” అనే భావంలో ఉండాలి. అది “యువతను తప్పుపట్టాలి” అనే మాటలో కాదు.. “యువతకు సరైన దారి చూపాలి” అనే సంకల్పంలో ఉండాలి. అది “ఫోన్ పారేయాలి” అనే మాటలో కాదు.. “ఫోన్‌ను సాధనంగా వాడాలి.. బానిసగా మారకూడదు” అనే అవగాహనలో ఉండాలి. అది “పిల్లలను నియంత్రించాలి” అనే భావంలో కాదు.. “పిల్లలతో మాట్లాడాలి.. వారికి విలువలు నేర్పాలి” అనే బాధ్యతలో ఉండాలి. అది “ఎవరినో ఒకరిని శత్రువుగా చూడాలి” అనే దారిలో కాదు.. “తప్పును ప్రశ్నించాలి.. మంచిని ప్రోత్సహించాలి” అనే ప్రజాస్వామ్య మార్గంలో ఉండాలి. అప్పుడు ఒక రోజు పల్లె గడప దగ్గర గజ్జె మోగుతుంది. డప్పు మోగుతుంది. పాట మొదలవుతుంది. మొదటి చరణం రైతు పాడుతాడు. రెండో చరణం కూలీ పాడుతాడు. మూడో చరణం విద్యార్థి పాడుతాడు. నాలుగో చరణం నిరుద్యోగ యువకుడు పాడుతాడు. ఐదో చరణం తల్లి పాడుతుంది. ఆరవ చరణం తండ్రి పాడుతాడు. చివరగా అందరూ కలిసి పాడే పల్లవి ఒక్కటే– “మా బతుకే మా ఉద్యమం.. మా భవిష్యత్తే మా బాధ్యత.. మా ప్రశ్నకు సమాధానం కావాలి.. మా పిల్లలకు మంచి రేపు కావాలి!”

అదే రోజు విమలక్క యాభై ఏళ్ల పాటకు కొత్త జన్మ వచ్చినట్టవుతుంది. యాభై గంటల పండుగ ముగిసినా.. పాట ముగియదు. వేదిక ముగిసినా.. గజ్జె ఆగదు. ఒక కార్యక్రమం ముగిసినా.. ప్రజా చైతన్యం ఆగదు. విమలక్క గొంతు కొనసాగాలి అనే ఆకాంక్ష కంటే గొప్పది–ఆ గొంతు నుంచి మరో వెయ్యి గొంతులు పుట్టాలి. ఒక విమలక్క పల్లెకు వెళ్లడం కంటే.. ప్రతి పల్లెలో ఒక చైతన్య గొంతు పుట్టడం గొప్పది. ఒక గజ్జె మోగడం కంటే.. ప్రతి యువకుడి మనసులో బాధ్యత అనే గజ్జె మోగడం గొప్పది. ఒక పాట వినిపించడం కంటే.. ఆ పాట విన్న తర్వాత ఒక యువకుడు మత్తును వదిలి చదువును ఎంచుకోవడం గొప్పది. ఒక కుటుంబం ఫోన్‌లను పక్కన పెట్టి గంటసేపు మాట్లాడుకోవడం గొప్పది. ఒక తండ్రి కొడుకును తిట్టకుండా అతని బాధ వినడం గొప్పది. ఒక తల్లి కూతురి కలను అర్థం చేసుకోవడం గొప్పది. ఒక యువకుడు తన ప్రభుత్వాన్ని ఆధారాలతో ప్రశ్నించడం గొప్పది. ఒక అధికారి ప్రజల ప్రశ్నకు పారదర్శకంగా సమాధానం చెప్పడం గొప్పది.

నాడు పోరాటం ఒక దశ.
నేడు చైతన్యం మరో దశ.
నాడు పాట ఒక ఆయుధం.
నేడు పాట ఒక అద్దం.
నాడు దోపిడీని ప్రశ్నించిన గొంతు..
నేడు మన తప్పులనూ ప్రశ్నించాలి.
నాడు తెలంగాణ కోసం మోగిన గజ్జె..
నేడు తెలంగాణ భవిష్యత్తు కోసం మోగాలి.
యువత నడుం బిగించాలి.. కుటుంబం
మేలుకోవాలి.. పల్లె కదలాలి..
ప్రభుత్వం జవాబుదారీ కావాలి.

**అప్పుడు మాత్రమే తెలంగాణ సాధనకు నిజమైన సార్థకత దక్కిందని చెప్పగలం.**

విమలక్క గజ్జె... కొత్త చరణం మోగాలి.
పాట మళ్లీ పల్లెకు వెళ్లాలి.
పల్లె మళ్లీ ఆలోచించాలి.
యువత మళ్లీ నడుం బిగించాలి.
ప్రతి ఇంట్లో మంచి మాట మోగాలి.
ప్రతి మనసులో బాధ్యత మేలుకోవాలి.
ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజల ప్రశ్నకు
సమాధానం వినిపించాలి.
అప్పుడే యాభై ఏళ్ల పాటకు..
రాబోయే తరాల భవిష్యత్తుకు
నిజమైన అర్థం వస్తుంది.




This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.